teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 123 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 28 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం

### ఈ భేటీలో పలు కీలక అంశలపై చర్చించే అవకాశం



హైదరాబాద్, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన బుధవారం మంత్రివర్గ సమావేశం జరగనుంది. బుధవారం ఉదయం 11 గంటలకు కేబినెట్ భేటీ కానుంది. ఈ భేటీలో పలు కీలక అంశలపై చర్చించే అవకాశం ఉంది. రైతు రుణమాఫీ, రైతు బంధు, రేషన్ కార్డు, హెల్త్ కార్డుపై చర్చించినట్లు సమాచారం. రాష్ట్రంలో పూర్తి స్థాయి రుణమాఫీ కాకపోవడంతో ప్రభుత్వం జిల్లా వ్యవసాయ అధికారులకు కీలక సూచనలు చేసింది. జిల్లాల్లో రుణమాఫీ కానీ రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశించింది.




## సెప్టెంబర్‌లో 10 రోజుల పాటు ప్రజాపాలన

### రేషన్ కార్డు, హెల్త్ కార్డుల కోసం వివరాల సేకరణ

### వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష

హైదరాబాద్, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న వారికి సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. సెప్టెంబర్ 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిచబోతున్నట్లు వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం. సెప్టెంబర్ లో 10 రోజుల పాటు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించనున్నామని ఇందు సంబంధించి క్షేత్రస్థాయిలో అధికారులను సన్నద్ధం చేయాలని అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రేషన్ కార్డు, హెల్త్ కార్డుల కోసం వివరాల సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. పూర్తి హెల్త్ ప్రొఫైల్ తో రాష్ట్రంలో ప్రతీ పౌరుడికి హెల్త్ కార్డులు ఇవ్వబోతున్నట్లు వివరించారు. కాగా రేషన్ కార్డులు ఆరోగ్య శ్రీ కార్డులను వేరు వేరుగా అందిచాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్ కార్డులకు

మిగతా 2 లో





## రుణమాఫీపై ఇంటింటి సర్వే

### రుణమాఫీ అమలు కాని రైతుల ఇంటికి వ్యవసాయ సిబ్బంది

### అర్హులైన వారిని గుర్తించి రుణమాఫీ చేస్తామని స్పష్టం

తెలంగాణ రాష్ట్రంలో రైతు రుణమాఫీపై గందరగోళం నెలకొంది. కొన్నిచోట్ల బ్యాంకుల తప్పిదం వల్ల రుణమాఫీ జరగలేదు. మరికొన్ని చోట్ల అధికారుల మిస్టేక్స్ జరిగాయి. ఆ క్రమంలో రైతు భరోసా పేరుతో యాప్‌ను తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. యాప్ డిజైన్ ఆదివారం పూర్తి కాగా మంగళవారం నుంచి గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంది. యాప్‌కును క్షేత్రస్థాయి సిబ్బందికి పంపించి, అందులో వివరాలు ఎలా నమోదు చేయాలనే అంశంపై శిక్షణ కూడా ఇచ్చారు.

హైదరాబాద్, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రుణం అమలు కాని రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం యాప్ తీసుకొచ్చింది. అర్హత కలిగి రుణమాఫీ కాని వారి ఇళ్లకు వ్యవసాయ శాఖ అధికారులు వెళతారు. వారి ఇంటి వద్ద యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. ఈ రోజు నుంచి రుణమాఫీ అమలు

మిగతా 2 లో



## లిక్కర్ స్కాం కేసులో కవితకు సుప్రీం కోర్టు బెయిల్

### సీబీఐ, ఈడీ రెండూ కేసుల్లో కవితకు ఊరట

### ఇతర దేశాలకు వెళ్లాలంటే మెజిస్ట్రేట్ కోర్టు పర్మీషన్ తప్పనిసరి

న్యూ ఢిల్లీ, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): లిక్కర్ స్కాం కేసులో కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. సీబీఐ, ఈడీ రెండూ కేసుల్లో కవితకు ఊరట లభించింది. రెండు కేసుల్లో బెయిల్ కు గానూ ఆమె రూ10 లక్షల ష్యూరిటీ బాండ్ కోర్టుకు సమర్పించాలి. అంతేకాకుండా కేసు నమోదు అయిన స్థానిక మేజిస్ట్రేజ్ కోర్టులో హ్యాండ్ ఓవర్ చేయాల్సి ఉంటుంది. ఇతర దేశాలకు వెళ్లాలంటే మెజిస్ట్రేట్ కోర్టు పర్మీషన్ తీసుకోవాలి. లిక్కర్ స్కాం కేసులో సాక్ష్యాలను, సాక్షులను ప్రభావితం చేయకూడదని చెప్తూ ఈ మూడు కండీషన్లతో బెయిల్ మంజూరు చేసింది. లిక్కర్ స్కాం కేసులో తర్వాతి విచారణకు సహకరిస్తూ వాయిదాలకు హాజరుకావాలని సూచించింది సూప్రీం కోర్టు. ఈ ఏడాది మార్చి 15 సాయంత్రం ఈడీ కవితను అరెస్ట్ చేసి ఢిల్లీ

మిగతా 2 లో



## కేంద్ర మంత్రి బండి సంజయ్ వాఖ్యలకు స్పందించిన కేటీఆర్

### వ్యాఖ్యలను సుప్రీంకోర్టు ధిక్కార చర్యలుగా పరిగనించాలని కోరిన కేటీఆర్

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ రావడంపై స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ సెటైర్లు వేసిన సంగతి తెలిసిందే. కవితకు బెయిల్ రావడం అనేది కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీలు సాధించిన విజయం అని సోషల్ మీడియాలో ఓ పోస్టు చేశారు. బెయిల్ విషయంలో ఆ రెండు పార్టీల వారి కృషి ఆఖరికి ఫలించిందని వ్యాఖ్యానించారు. కవిత బెయిల్ ద్వారా బయటకు వస్తే కాంగ్రెస్ లీడర్ తెలంగాణ నుంచి రాజ్యసభలోకి వెళ్తున్నారని విమర్శించారు. దీనిపై కేటీఆర్

మిగతా 2 లో

## వివాదంలో జిడబ్ల్యూఎంసీ ఎదుట వెలసిన ఫ్లెక్సీ

### ట్విట్టర్ వేదికగా కేటీఆర్ ఫైర్

### ఇది అధికారిక నిర్ణయమా? అనధికార నిర్లక్ష్యమా?




హైదరాబాద్, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ హెడ్‌ఆఫీసు ఎదుట వెలసిన ఫ్లెక్సీపై మాజీ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ఫైర్‌అయ్యారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ లేని రాజముద్రతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది అధికారిక నిర్ణయమా? అనధికార నిర్లక్ష్యమా? అసలు ఏం జరుగుతుందో కనీసం మీకైనా తెలుసా? తెలంగాణ అస్తిత్వ చిహ్నాలైన కాకతీయ తోరణం, చార్మినార్‌లతో ఈ వెకిలి పనులేంటి? ఈ కొత్త చిహ్నాన్ని ఎవరు? ఎప్పుడు ఆమోదించారు?ఒకవేళ ఆమోదించకపోతే అధికారులు ఎందుకు దీన్ని వాడారు? దీనికి కారకులెవరో కనుక్కొని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న' అంటూ ఆ పోస్టును సీఎస్ శాంతికుమారికి ట్యాగ్ చేశారు.



## కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై కొనసాగుతున్న విచారణ


### ఫైనల్ అప్రూవల్‌కు అన్ని ఒకే దగ్గర చేసినట్లు ఇంజనీర్ల వెల్లడి

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం లిఫ్టుల్లో అవినీతి, అక్రమాలు, నాణ్యతా లోపాలపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు జస్టిస్ పీసీ చంద్రఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతోంది. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగుబాటుకు కారణం రాఫ్ట్ కింద పలు సమస్యల వల్ల జరిగింది అన్నట్లు మిషన్ ముందు ఇంజనీర్లు చెప్పారు. సిఖెండ్ ఫైల్స్, అలాట్మెంట్ డివియేషన్ వల్ల సమస్య వచ్చింది అన్నట్లు ఇంజనీర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. డిజైన్ల అప్రూవల్ తర్వాత అన్నారం గ్యారేజీ మోడిఫికేషన్

మిగతా 2 లో

## తెలంగాణలో మరో డిఎస్సికి సర్కార్ కసరత్తు

### ఖాళీల సమాచారం సేకరిస్తున్నట్లు సమాచారం



తెలంగాణ బ్యూరో, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి సంబంధించిన టీజీ డీఎస్సీ 2024 పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా జులై 18వ తేదీ నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో జరిగిన విషయం తెలిసిందే. ఈ డీఎస్సీ పరీక్షలకు మొత్తం 2,79,957 దరఖాస్తు చేసుకోగా వీరిలో 87.61 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అంటే 2,45,263 మంది పరీక్షకు హాజరయ్యారు. అత్యధికంగా ఎస్‌జీటీ పోస్టులకు 92.10 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. అయితే ఇప్పటికే ఈ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీ విడుదలైంది. అప్పటి

మిగతా 2 లో



## హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు అదనపు భద్రత

### ముప్పు పొంచివుందని భావించి ఈ మేరకు ప్రభుత్వం చర్యలు

2

## జమ్ముకశ్మీర్ వాసులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్

### లడఖ్‌లో మరో 5 జిల్లాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన

రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన కొన్ని విషయాల్లో కేంద్ర ప్రభుత్వం తరచూ ఏదో ఒక నిర్ణయం తీసుకుంటుంది. ముఖ్యంగా కేంద్రపాలిత ప్రాంతాల విషయంలో అయితే కేంద్ర ప్రభుత్వానికి అధికారాలు ఎక్కువగా ఉంటాయి. తాజాగా జమ్ముకశ్మీర్ వాసులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది.



న్యూ ఢిల్లీ, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): కేంద్రపాలిత ప్రాంతం లడఖ్ సంబంధంచి మోదీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. లడఖ్‌లో కొత్తగా మరో 5 జిల్లాలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. జమ్ముకశ్మీర్ నుంచి విడిపోయి

మిగతా 2 లో


## డెంగ్యూ కట్టడిపై వైద్యారోగ్య శాఖ మంత్రి దిశానిర్దేశం

### సీజనల్ వ్యాధుల కట్టడిపై అధికారులతో మంత్రి సమీక్ష



హైదరాబాద్, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): సీజనల్ వ్యాధుల కట్టడి పై సచివాలయంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో డెంగ్యూ కట్టడిపై అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో డెంగ్యూ కేసుల కట్టడిపై ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశం ఇచ్చారు. డెంగ్యూ కట్టడిపై రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూమ్ ను రాష్ట్ర ప్రజారోగ్య

మిగతా 2 లో



## రాజ్యసభలో ఎన్డీయే కూటమి మెజారిటీ మార్క్

### ప్రతిపక్ష నాయకత్వ హెూదాని దక్కించుకున్న కాంగ్రెస్

న్యూ ఢిల్లీ, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): పార్లమెంట్ రాజ్యసభకు జరిగిన ఉప ఎన్నికల్లో 9 మంది బీజేపీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో రాజ్యసభలో అధికార బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి మంగళవారం మెజారిటీ మార్కుని చేరుకుంది. బీజేపీ బలం 96కి

మిగతా 2 లో

# సెప్టెంబర్ లో 10 రోజుల పాటు ప్రజాపాలన

**మొదటి పేజీ తరువాయి**

అర్హులను గుర్తించేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ఇవాళ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం రేషన్ కార్డులకు హెల్త్ కార్డుల విషయంలో కీలక ఆదేశాలు జారీ చేశారు.

**ఉస్మానియా హాస్పిటల్ ను గోషామహల్ కు తరలిస్తాం: సీఎం**

ఉస్మానియా హాస్పిటల్ ను గోషామహల్ కు తరలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. గోషామహల్ లో నిర్మించాలని తలపెట్టిన కొత్త ఉస్మానియా ఆసుపత్రిపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి ఇందుకు సంబంధించి భూ బదలాయింపు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి ఆర్కిటెక్ట్స్ తో డిజైన్ లను రూపొందించాలని, వచ్చే యాభై ఏళ్లను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. భవిష్యత్ లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా డిజైన్ లు సిద్ధం చేయాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా రోడ్ కనెక్టివిటీ ఉండేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. గోషామహల్ సిటీ పోలీస్ అకాడమీకి ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలన్నారు. కాగా ఉస్మానియా ఆసుపత్రిని గోషామహల్ పోలీసు మైదానంలో భవనం నిర్మించనున్నట్లు ఈనెల మొదటి వారంలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనే సభలో సీఎం ప్రకటన చేశారు.

# లిక్కర్ స్కాం కేసులో కవితకు సుప్రీం కోర్టు బెయిల్

**మొదటి పేజీ తరువాయి**

తరలించింది. 153 రోజుల పాటు కస్టడీలో ఉంది. కవిత తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ గంటన్నర సేపు వాదనలు వినిపించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 45(1)లోని ప్రొవిజో బెయిల్ విషయంలో మహిళలు ప్రత్యేక పరిశీలనకు అర్హులని సుప్రీం కోర్టు బెంచ్ పేర్కొంది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వరుసగా ఛార్జిషీట్ తోపాటు ప్రాసిక్యూషన్ ఫిర్యాదులను దాఖలు చేశాయని ఆయన తెలిపారు. ఆమె ఈడీ కేసులో ఐదు నెలలు, సీబీఐ కేసులో నాలుగు నెలలు కస్టడీలో ఉన్నారు. రెండు కేసుల్లో మొత్తం సాక్షుల సంఖ్య 493 అని, మొత్తం డాక్యుమెంట్ల సంఖ్య దాదాపు 50,000 పేజీలని కవిత లాయర్ రోహత్గీ కోర్టుకు చెప్పుకొచ్చారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ వాఖ్యలకు స్పందించిన కేటీఆర్

**మొదటి పేజీ తరువాయి**

స్ట్రాంగ్ రిప్లై ఇచ్చారు. మీరు కేంద్ర మంత్రి. కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రిగా ఉన్నారు. అలాంటి స్థానంలో ఉండి సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది మీ స్థానానికి తగినదేనా, గౌరవనీయులైన భారత ప్రధాన న్యాయమూర్తి, గౌరవనీయమైన సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలను గుర్తించి ధిక్కార చర్యలను తీసుకోవాల్సిందిగా నేను గౌరవపూర్వకంగా కోరుతున్నాను అని కేటీఆర్ అన్నారు.

# హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు అదనపు భద్రత

హైదరాబాద్, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదనపు భద్రత కల్పించింది. చెరువులను ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్న ఆయనకు ముప్పు పొంచివుందని భావించి ప్రభుత్వం ఈ మేరకు చర్య తీసుకుంది. హైదరాబాద్ మధురానగర్ కాలనీలోని రంగనాథ్ ఇంటివద్ద భద్రత పెంచడంతో పాటు పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసింది. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగానే ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం భద్రత పెంచినట్టు తెలుస్తోంది. మరోవైపు భాగ్యనగరంలోని అక్రమ కట్టడాలపై హైడ్రా దూకుడు కొనసాగుతోంది. ముఖ్యంగా చెరువులను చెరబట్టి వెలిసిన నిర్మాణాలను కూల్చివేస్తూ అక్రమార్కుల పాలిట సింహస్వప్నంగా మారింది. హీరో అక్కినేని నాగార్జున ఎన్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ తో పాటు ఇతర ప్రముఖులకు సంబంధించిన అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. తాజాగా ఎంఐఎం అగ్రనేత అక్బరుద్దీన్ ఒవైసీ కూడా హైడ్రా నోటీసులు ఇచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు పలువురు నేతలపైనా హైడ్రా కన్నేసింది. చెరువులను కబ్జా చేసినవారిపై ఉక్కుపాదం మోపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో హైడ్రా మరింత దూకుడుతో పనిచేస్తోంది. ఎవరు ఎన్ని ఒత్తిళ్లు చేసినా పట్టించుకోకుండా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ముందుకెళుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారు ఎంతటివారైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు ముంపు పొంచివుందన్న నిఘా వర్గాల సమాచారంతో ప్రభుత్వం భద్రత పటిష్టం చేసింది. మరోవైపు హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వానికి హైడ్రా అందజేసిన సమాచారం ప్రకారం ఇప్పటివరకు 18 ప్రాంతాల్లో మొత్తం 166 అక్రమ నిర్మాణాలు కూల్చివేశారు. కబ్జాదారుల కబంధ హస్తాల నుంచి 43 ఎకరాల స్థలాన్ని హైడ్రా కాపాడింది. కాగా, హైడ్రా చర్యలను నగరవాసులు, పర్యావరణ ప్రేమికులు స్వాగతిస్తున్నారు. హైడ్రాకు మద్దతుగా ర్యాలీలు, ప్రదర్శనలు చేపడుతున్నారు.

# డెంగ్యూ కట్టడిపై వైద్యారోగ్య శాఖ మంత్రి దిశానిర్దేశం

**మొదటి పేజీ తరువాయి**

సంచాలకులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని తెలిపారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న సీజనల్ వ్యాధుల బాధితుల వివరాలను కంట్రోల్ రూమ్ కు తెలియచేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ కోరారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందేలా కంట్రోల్ నుండి సూచనలు అందించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో డెంగ్యూ కట్టడిపై స్పెషల్ డ్రైవ్ ను చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశాలు ఇచ్చారు. తెలంగాణలో డెంగీ పంజా విసురుతోంది. ప్రస్తుతం 5,500పైగా డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. అనేక జిల్లాల్లో 100కు పైగా కేసులు నమోదు అవగా ఇక, హైదరాబాద్ లో 2148, కరీంనగర్ 224, ఖమ్మం 641, మహబూబాబాద్ 103, మహబూబ్ నగర్ 120, మేడ్చల్ మల్కాజ్ గిరి 356, నల్గొండ 151, పెద్దపల్లి 155, రంగారెడ్డి 100, సంగారెడ్డి 132, సూర్యాపేట 222, వరంగల్ లో 208 కేసులు నమోదు అయినట్లు వైద్యులు తెలిపారు. మరోవైపు డెంగ్యూ, చికున్‌గున్యా , మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా జ్వరాలతో సహా దాదాపు అన్ని ప్రధాన సీజనల్ వ్యాధులు గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం పెరిగాయి. వాతావరణ మార్పుల కారణంగా ఈ వ్యాధుల బారిన పడుతున్నారు. డెంగీ, చికున్‌గున్యా వంటి జబ్బులతో బాధపడుతున్నారు. జ్వరం తగ్గినా ఒళ్లు నొప్పులతో సతమతమవుతున్నారు. ఓవైపు ఉదయమంతా ఎండలు, సాయంత్రం కాగానే వర్షాలతో భిన్న వాతావరణం ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది.

# రాజ్యసభలో ఎన్డీయే కూటమి మెజారిటీ మార్క్

**మొదటి పేజీ తరువాయి**

చేరుకుంది. కూటమిగా చూస్తే ఎన్డీయే బలం 112కి చేరింది. అధికార కూటమికి ఆరుగురు నామినేటెడ్ ఎంపీలతో పాటు ఒక స్వతంత్ర సభ్యుడి మద్దతు కూడా ఉంది. మొత్తం 12 స్థానాలకు ఉప ఎన్నికలు జరిగితే అన్ని స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. 9 మంది బీజేపీకి చెందినవారు కాగా, మరో మూడు స్థానాల్లో కాంగ్రెస్ నుంచి ఒకరు, ఎన్సీపీ అజిత్ పవార్ వర్గం నుంచి ఒకరు, ఆర్ఎల్ఎం నుంచి ఒకరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజ్యసభలో మొత్తం స్థానాలు 245. ప్రస్తుతం 8 ఖాళీగా ఉన్నాయి. ఇందులో జమ్మూ కాశ్మీర్ నుంచి 04 ఉండగా, మరో నాలుగు నామినేటెడ్ స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం రాజ్యసభలో సభ్యుల సంఖ్య 237 కాగా, మెజారిటీ మార్క్ 119. కాంగ్రెస్ బలం 27కి చేరుకోవడంతో ప్రతిపక్ష నాయకత్వ హోదాని దక్కించుకుంది. ప్రతిపక్ష నేత హోదా పొందాలంటే పార్టీకి కనీసం 25 మంది ఎంపీలు ఉండాలి.

# రుణమాఫీపై ఇంటింటి సర్వే

**మొదటి పేజీ తరువాయి**

కాని రైతుల ఇంటికి వ్యవసాయ సిబ్బంది వెళతారు. రుణమాఫీ కాలేదని పలువురు రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. తొలుత వారి ఇంటికి వ్యవసాయ శాఖ సిబ్బంది వెళతారు. అక్కడ వారి రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, ఇతర డాక్యుమెంట్స్ పరిశీలిస్తారు. కుటుంబ సభ్యుల వివరాలు, ఫొటోలు కూడా తీసుకుంటారు. రుణమాఫీకి సంబంధించిన వివరాలు, ఫోన్ నంబర్ ధృవీకరణ పత్రం రూపొందిస్తారు. కుటుంబ యజమాని సంతకం తీసుకుంటారు. ఆ యజమాని రుణానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శి ధృవీకరించాల్సి ఉంటుంది. అర్హులైన వారిని గుర్తించి రైతులకు రుణమాఫీ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. కొందరు రైతులకు రుణమాఫీ ఎందుకు కాలేదనే అంశంపై ఉన్నతాధికారులు వివరించారు. రైతుల రేషన్ కార్డు లేకపోవడం, కుటుంబ వివరాలు సరిగా నమోదు కాలేదని పేర్కొన్నారు. ఆయా కారణాలతో రుణమాఫీ కాలేదని వివరించారు. ఆ క్రమంలో రైతుల ఇంటి వద్దకొచ్చి వివరాలు నమోదు చేసి, అర్హత ఉంటే రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.



# తెలంగాణలో మరో డిఎస్సికి సర్కార్ కసరత్తు

**మొదటి పేజీ తరువాయి**

నుంచి వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ప్రిలిమినరీ 'కీ'తో పాటు అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లు కూడా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. 'కీ'పై అభ్యంతరాలను స్వీకరించేందుకు ఆగస్టు 20వ తేదీ సాయంత్రం 5.00 గంటలతో ముగిసింది. అయితే ఎప్పుడూ లేని విధంగా విద్యాశాఖ విడుదల చేసిన డీఎస్సీ ప్రాథమిక 'కీ'పై భారీగా అభ్యంతరాలు రావడం గమనార్హం. ఈసారి ప్రాథమిక 'కీ'ని సవాల్ చేస్తూ దాదాపు 28,500 అభ్యంతరాలు వచ్చినట్టు విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి. కాగా జూలై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ప్రాథమిక కీలను ఆగస్టు 13వ తేదీన విడుదల చేసింది. ఆగస్టు 20వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించారు. ఆగస్టు నెలాఖరులో ఫైనల్‌కీ, ఫలితాలను విడుదల చేసే అవకాశం ఉంది. ఇదిలావుండగా తెలంగాణ ప్రభుత్వం మరో డిఎస్సి పై కసరత్తు చేస్తున్నట్లు వార్తలు హల్చల్ చేస్తున్నాయి. ఇటీవల 11, 062 పోస్టులకు డీఎస్సీ పరీక్ష నిర్వహించిన ప్రభుత్వం మరో డిఎస్సి కి కసరత్తు చేస్తుంది. డిసెంబర్, జనవరి నెలలో నోటిఫికేషన్ జారీ చేసి జూన్, జూలైలోపు నియామకాలు పూర్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఆలోపు టెట్ కూడా నిర్వహించే అవకాశం ఉంది. ప్రస్తుత డీఎస్సీతో ఎంత మంది ఉపాధ్యాయులు భర్తీ అవుతారు? ఇంకా ఎన్ని ఖాళీలు ఉంటాయనే సమాచారాన్ని జిల్లాల వారీగా సేకరిస్తుంది. ఈ సమాచారం పూర్తయిన తర్వాత డీఎస్సీ పై ప్రభుత్వం భారీ గుడ్ న్యూస్ ఇవ్వబోతున్నట్టు సోషల్ మీడియా లో జోరుగా ప్రచారం అవుతున్న సమాచారం.

# ఇకపై పాఠశాలల్లో స్పోర్ట్స్ పీరియడ్ తప్పనిసరి

## ఈ మేరకు చర్యలు తీసుకోనున్న ప్రభుత్వం



తెలంగాణ బ్యూరో, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): ఇకపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో తప్పనిసరిగా స్పోర్ట్స్ పీరియడ్ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంత్రి భట్టి విక్రమార్క హైదరాబాద్ ఎల్ బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ప్రపంచ స్థాయిలోనే తెలంగాణ నుంచి అద్భుతమైన క్రీడాకారులు తయారు కావాలని జాతీయ, అంతర్జాతీయ క్రీడలలో తెలంగాణకు ప్రాధాన్యం పెరిగేలా కృషి చేస్తామన్నారు భట్టి విక్రమార్క.

# హైడ్రా "జిల్లాలకు" విస్తరింపజేయాలంటూ సీఎంకి లేఖలు

## రేవంత్‌పై ప్రజల ప్రశంసల జల్లు



వరంగల్, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): అక్రమ నిర్మాణాల కూల్చివేత పనులు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. బడాబాబులు ఎక్కడపడితే అక్కడ చెరువులను కూడా పూడ్చేసి మరీ స్థలాలను ఆక్రమించి భారీ బిల్డింగ్‌లు లేపేశారు. హైడ్రా ఎంట్రీతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అక్రమ నిర్మాణాల కూల్చివేతను కొందరు వ్యతిరేకిస్తుండగా మెజారిటీ ప్రజానీకం మాత్రం మద్దతుగా నిలుస్తోంది. పలు పార్టీలకు సైతం హైడ్రాకు మద్దతు తెలియజేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలోనూ హైడ్రాకు మద్దతు పెరుగుతోంది. పలువురు ఎమ్మెల్యేలు దీనిని జిల్లాకు విస్తరింప జేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డిని కోరుతూ లేఖలు రాశారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతపై తమ లేఖల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు. రేవంత్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. వరంగల్‌లోనూ అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేస్తున్నారు. హైకోర్టులో 200 మంది ఇప్పటికే కూల్చివేతలకు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేశారు. వరంగల్ దేశాయిపేట్ ఎంహెచ్ నగర్ చిన్నవడ్డేపల్లి చెరువు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌లో నిర్మాణాలను అధికారులు కూల్చివేస్తున్నారు. అక్కడంతా పేదలు పట్టా భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నాయి కాబట్టి ఇల్లు కూల్చేస్తామని వరంగల్ మునిసిపల్ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. నోటీసులను సవాల్ చేస్తూ 200మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై జస్టిస్ వినోద్ కుమార్ విచారణ నిర్వహించారు. ఎలాంటి సర్వే చేయకుండా ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు ఉన్నాయని ఆరోపణలు చేస్తున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. 30 నుంచి 60 చదరపు గజాల స్థలంలోనే పిటిషనర్ల గుడిసెలు ఉన్నాయని పిటిషన్ తరుపు న్యాయవాది వాదించారు. ప్రజలకు జారి చేసిన పట్టాలపై విచారణ జరపాలని అప్పటివరకు పిటిషనర్లను అక్కడి నుంచి వెళ్లగొట్టొద్దని ప్రభుత్వానికి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. చెరువుల పరిరక్షణే ధ్యేయంగా హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ అక్రమ నిర్మాణాలను కూల్చేస్తామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తాజాగా ప్రకటించారు. హైదరాబాద్ తర్వాత అన్ని జిల్లాల్లోనూ చెరువులు పునరుద్ధరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హైడ్రాకు మంచి స్పందన వస్తోందని, ప్రజలంతా హర్షిస్తున్నారన్నారు. చెరువుల ఆక్రమణలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. హైదరాబాద్ ఒకప్పుడు లేక్ సిటీగా ఉండేదని, చెరువుల పరిరక్షకులు ఆక్రమణలపై ఆధారాలను సంబంధిత అధికారులకు అందజేయాలని పొన్నం సూచించారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై కొనసాగుతున్న విచారణ

**మొదటి పేజీ తరువాయి**

జరిగిందని కమిషన్‌ముందు ఇంజనీర్ ఒప్పుకున్నారు. అయితే రామగుండం ఈసీ లేఖపై మాత్రం కమిషన్ ముందు ఇంజనీర్ దయాకర్ రెడ్డి స్పష్టత లేని సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది. హై పవర్ కమిటీలో సీడీఓ అధికారులు సభ్యులుగా ఉన్నారు అని ఇంజనీర్లు ఒప్పుకున్నారు. డిజైన్లు తయారు చేసే ముందు సైట్ విజిట్ ఖచ్చితంగా చేయనక్కర్లేదు అని కమిషన్ ముందు వారు చెప్పారు. అన్నారం సుందిళ్ల బ్యారేజీల లొకేషన్ మారినట్లు కమిషన్‌కు అధికారులు చెప్పారు. అయితే మేడిగడ్డ లొకేషన్ మారలేదని తాజా మాజీ ఇంజనీర్లు కమిషన్ ముందు స్పష్టం చేశారు. సీడీఓ – ఎల్‌అండ్‌టీ వేరువేరుగా డిజైన్లు తయారుచేసి ఫైనల్ అప్రూవల్‌కు అన్ని ఒకే దగ్గర చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు. మూడు బ్యారేజీలకు సంబంధించి డిజైన్లలో ఎలాంటి సమస్య లేదని నిబంధనల ప్రకారమే డిజైన్లు ఉన్నాయని ఇంజనీర్లు వెల్లడించారు. మరోవైపు మాజీ జల వనరుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మెన్ వి ప్రకాష్ బీఆర్‌కే భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 37 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. రఘు, వేధిర్ శ్రీరామ్ సీడబ్ల్యూసీ అంశాలను వక్రీకరించారని తెలిపారు. తాను కమిషన్ ముందు అఫిడవిట్ దాఖలు చేశానన్నారు. తుమ్మిడిహట్టి నిర్మాణం సాధ్యం కాదు అని వివరాలు ఇచ్చినట్లు తెలిపారు. తుమ్మడిహెట్టిపై కాగ్ ఆక్షేపాలను కమిషన్‌కు తెలియజేసినట్లు చెప్పారు. అఫిడవిట్ పరిశీలన తరువాత మళ్ళీ పిలుస్తామని కమిషన్ అన్నదన్నారు. నిజమైన దోషులకు శిక్ష పడాలి అనేదే తమ ఉద్దేశమని వి.ప్రకాష్ పేర్కొన్నారు.

# జమ్ముకశ్మీర్ వాసులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్

**మొదటి పేజీ తరువాయి**

లడక్ కేంద్ర పాలిత ప్రాంతంగా ఏర్పడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఇక్కడ కేవలం రెండు జిల్లాలు మాత్రమే ఉన్నాయి. అయితే తాజాగా కేంద్ర ప్రభుత్వం మరో 5 కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో మొత్తం జిల్లాల సంఖ్య 7కు పెరగనుంది. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఫలాలను.. లడఖ్‌లోని ప్రతి కుటుంబానికి అందించడమే మోదీ ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. లడఖ్‌లో కొత్తగా 5 జిల్లాలు ఏర్పాటు చేస్తూ తీసుకున్న నిర్ణయంపై ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. కొత్తగా 5 జిల్లాలను ఏర్పాటు చేస్తామని ట్విటర్ వేదికగా హోం మంత్రి ప్రకటించారు. అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన ప్రాంతంగా లడఖ్‌ను నిర్మించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పంలో భాగంగానే ఈ కొత్త జిల్లాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చామని అమిత్ షా తెలిపారు. ఈ క్రమంలోనే ఆ కొత్త జిల్లాల పేర్లను కూడా ప్రకటించారు. జన్‌స్కర్, ద్రాస్, షామ్, నుబ్రా, చాంగ్‌థాంగ్ అనే పేర్లు కొత్తగా ఏర్పాటు చేయబోయే జిల్లాలకు పెట్టినట్లు వివరించారు. ఈ కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రభుత్వ పాలన మరింత పటిష్ఠం అవుతుందని అమిత్ షా చెప్పారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వం అందేచే అభివృద్ధి సంక్షేమ ఫలాలు లడఖ్ లోని ప్రతి గడపకు చేరుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కేంద్ర హోంశాఖ తీసుకున్న ఈ కొత్త జిల్లాల ఏర్పాటు నిర్ణయంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. లడఖ్ ప్రజల క్షేమం, మెరుగైన పాలనకు ఈ కొత్త జిల్లాల ఏర్పాటు అనేది ఒక ముందడగని తెలిపారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు అవకాశాలు, సేవలు మరింత చేరువ అవుతాయని మోదీ హర్షం వ్యక్తం చేశారు. 2019లో కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసి.. జమ్మూ కాశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన సంగతి తెలిసింది. అందులో జమ్మూ కాశ్మీర్ ఒకటి కాగా.. లడఖ్ మరొకటిగా ఉంది. మరి.. తాజాగా కేంద్ర హోం శాఖ తీసుకున్న ఈ నిర్ణయంపై మీ అభిప్రాయాలను కామెంట్స్ రూపంలో తెలియజేయండి.

# హైదరాబాద్లో హైడ్రా లాగే.. వరంగల్లో వాడ్రా కావాలి

## ఫోరం ఫర్ బెటర్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్ డిమాండ్




హన్మకొండ జిల్లా, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): హైద్రాబాద్ లోని హైడ్రా వ్యవస్థలాగే వరంగల్ నగరానికి వాడ్రా వ్యవస్థ కావాలని ఫోరం ఫర్ బెటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హన్మకొండలోని టిజిఓ భవనంలో పౌర సంఘాలు, మేధావులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పుల్లూరు సుధాకర్ మాట్లాడుతూ నగరాల అస్తవ్యస్త విస్తరణ, చెరువులు, నాలాలలో వెలసిన అక్రమ నిర్మాణాలు నగర పర్యావరణ వ్యవస్థను ధ్వంసం చేసి వరదల వంటి పెను విపత్తులకు కారణమవుతుందన్నారు. వరంగల్ నగరంలో చెరువులు, నాలాలు ఆక్రమణలకు గురయ్యాయనీ, ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడానికి హైడ్రా లాంటి స్వతంత్ర వ్యవస్థ వరంగల్ కూ అవసరముందన్నారు. వరంగల్ నగర ప్రత్యేక పరిస్థితులకనుగుణంగా వాడ్రాలో నిబంధనలు పొందుపరచాలన్నారు. నాలాలపై పెద్ద ఆక్రమణల్ని తొలగిస్తూ అదే సమయంలో పేదల, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనాలకు భంగం కలగకుండా వాడ్రాలో నిబంధనలు రూపొందించాలన్నారు. వాడ్రా నివేదిక ఎలా ఉండాలో వివరిస్తూ డాక్యుమెంటు తయారు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ ఉద్యమకారుల వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ రాజకీయ నాయకుల, అధికారుల ఒత్తిళ్ళకు తలొగ్గని విధంగా వాడ్రా నిర్మాణం ఉండాలన్నారు. చట్ట వ్యతిరేకంగా అనుమతులిచ్చిన అధికారులను, వాటి వెనక ఉన్న రాజకీయకులపై కఠిన చర్యలుండాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం, జనవిజ్ఞాన వేదిక లక్ష్మారెడ్డి చెరువుల పరిరక్షణ పర్యావరణ అంశాలను వివరించారు. ఈ సందర్భంగా చేసిన తీర్మాణాలను ప్రభుత్వానికి పంపాలని నిర్ణయించారు. హైడ్రా లాగే వరంగల్ కు వాడ్రా వ్యవస్థను ఏర్పాటు చేయాలని, నగర ప్రత్యేక పరిస్థితుల కనుగుణంగా వాడ్రా నిబంధనలుండాలని, వరదలకు కారణవవుతున్న నాలాల వెంట, చెరువుల శిఖంలో వెలసిన పెద్ద ఆక్రమణలను సత్వరమే తొలగించాలని, స్థిరాస్తి వ్యాపారుల మోసాలకు బలై నాలాల వెంట, చెరువులలో నిర్మాణాలు చేసిన పేద, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలను కాపాడాలని, వారికి ప్రత్యామ్నాయాలు చూపాలని, అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో తిరునహరి శేషు, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ప్రతినిధులు, పెరుమాళ్ళ లక్ష్మణ్, శ్రవణ్ కుమార్, వేణు, ప్రొ. విజయబాబు, అనుమాండ్ల విద్యాసాగర్, జి.యాదగిరి, రాజ్మోహన్ రావు, మండల పరశురాములు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# కర్ణాటకలో కుర్చీలాట!

కర్ణాటకలో మరొకసారి సిఎం పదవి కోసం కుర్చీలాట మొదలైంది. సిఎం సిద్ధరామయ్య వరుస స్కాంలతో ఉక్కిరిబిక్కిరి అవుతూ ఉండడంతో కన్నడ రాజకీయం రసకందాయంలో పడింది. ప్రస్తుతం ఇదే అదనుగా సిఎం పోస్టు కోసం కీలక నేతలు తెరవెనక మంత్రంగాలు మొదలుపెట్టారు. 'మాడా భూములు', 'వాల్మీకి కార్పొరేషన్', 'రాష్ట్ర వక్ఫ్ బోర్డు' ఇలా వరుస స్కాంలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సిద్దరామయ్య సిఎం పదవి నుంచి దిగిపోవడానికి సిద్ధమైనట్టు వార్తలు వస్తున్నాయి. ఇదే సమయంలో సిద్దరామయ్యకు అధిష్టానం అండగా నిలవాలి. కానీ అధిష్టాన ప్రోత్సాహంతో సిఎం పదవి కోసం పోటీ రాజకీయాలు జరుగుతున్నాయి. ఒక రాష్ట్రంలో బలమైన నాయకుడిగా ఎవరు ఎదిగినా కాంగ్రెస్ అధిష్టానం భరించలేదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పూర్తికాలం ఆత్మవిశ్వాసంతో స్వేచ్ఛగా తమ రాష్ట్రంలో నిర్ణయాలను తీసుకోలేరు. ప్రతి చిన్న నిర్ణయానికి అధిష్టాన నిర్ణయంపై ఆధారపడతారు. అధిష్టానం చేతిలో కీలుబొమ్మలుగా వీరవిధేయత ప్రకటించినంత కాలమే వారు పదవిలో కొనసాగుతారు. ఒక రాష్ట్రంలో స్వయంగా ఒక వ్యక్తిని ముఖ్యమంత్రిగా అధిష్టానం నిర్ణయించడంతో అది సంతృప్తి చెందదు. పక్కలో బల్లెంలా మరో షాడో వర్గాన్ని లేదా మరో బలమైన నాయకుణ్ణి షాడో ముఖ్యమంత్రిగా ఆశలు కల్పిస్తుంది. ఈ షాడో వర్గం నిరంతరం ప్రస్తుత ముఖ్యమంత్రి నిర్ణయాలను, వ్యక్తిగత స్వేచ్ఛా నిర్ణయాలపై నిఘా పెట్టి ఎప్పటికప్పుడు అధిష్టానానికి సమాచారం చేరవేస్తూ ఉంటారు. కాంగ్రెస్ చరిత్ర తెలిసిన వారందరికీ ఈ విషయాలు తెలిసినవే. అందుకే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సిఎం పోస్టులకు గ్యారెంటీ ఎంతమాత్రం ఉండదని విమర్శకులు అంటూ ఉంటారు. ఉదాహరణకు అధికారంలోకి వచ్చి కనీసం 15 నెలలు కూడా కాకముందే కర్ణాటకలో మరొకసారి సిఎం పదవి కోసం కుర్చీలాట మొదలైంది. సిఎం సిద్దరామయ్య వరుస స్కాంలతో ఉక్కిరిబిక్కిరి అవుతూ ఉండడంతో కన్నడ రాజకీయం రసకందాయంలోపడింది. ప్రస్తుతం ఇదే అదునుగా సిఎం పోస్టు కోసం కీలక నేతలు తెరవెనక మంత్రంగాలు మొదలుపెట్టారు. 'మాడా భూములు', 'వాల్మీకి కార్పొరేషన్', 'రాష్ట్ర వక్ఫ్ బోర్డు' ఇలా వరుస స్కాంలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సిద్దరామయ్య సిఎం పదవి నుంచి దిగిపోవడానికి సిద్ధమైనట్టు వార్తలు వస్తున్నాయి. ఇదే సమయంలో సిద్దరామయ్యకు అధిష్టానం అండగా నిలవాలి. కానీ అధిష్టాన ప్రోత్సాహంతో సిఎం పదవి కోసం పోటీ రాజకీయాలు జరుగుతున్నాయి. కర్ణాటకలో సిఎం మార్పు త్వరలోనే జరుగునున్నట్లు పరిస్థితులు తెలుపుతున్నాయి. ఇదే అదనగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కెపిసిసి అధ్యక్షుడు డికె శివకుమార్ తెరవెనక మంత్రంగాన్ని ప్రారంభించినట్లు తెలుస్తున్నది. మంత్రి సతీశ్ జార్కిహోళీ తో సోమవారం రాత్రి 45 నిమిషాల పాటు ఏకాంతంగా భేటీ అయ్యారు. ఎందుకంటే కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అందరూ డికె శివకుమార్ సిఎం అవుతారని అంచనాలు వేశారు.

అయితే అధిష్టానం అనూహ్యంగా సిద్దరామయ్యను తెరమీదకు తెచ్చింది. సిఎం పదవిని కట్టబెట్టింది. దీనిపై డికె వర్గం ఎంఎల్ఎలు గుర్రుగా ఉన్నారు. కానీ, మెజారిటీ ఎంఎల్ఎలు మద్దతు సిద్దరామయ్యకు ఉండడంతో ఇంతకాలం సిఎం పదవికి ముప్పుకలగలేదు. డికెకు ఉపముఖ్యమంత్రి పదవిని ఇచ్చి అధిష్టానం బుజ్జగించింది. ఇప్పుడు సిద్దరామయ్య సిఎం పదవి వదులుకుంటే ఎవరు ఆ రేసులో ఉంటారో అన్నది ప్రస్తుతం చర్చ ముమ్మరంగా జరుగుతున్నది. మల్లికార్జున ఖర్గే లేదా మంత్రి జి పరమేశ్వర్‌కు కట్టబెట్టాలని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తున్నది. దీంతో డికె శివకుమార్ ఉన్నపళంగా సోమవారం రాత్రి జార్కిహోళిని కలిశారు. ఒకవేళ సిఎంగా తనను ప్రతిపాదించి మద్దతు ప్రకటిస్తే కెపిసిసి అధ్యక్ష పదవి వచ్చేలా తాను అధిష్టానాన్ని ఒప్పిస్తానని జార్కిహోళికి డికె ఆఫర్ చేసినట్లు తెలుస్తున్నది. కాగా ఇప్పటికే జార్కి హోళికి 20 మంది ఎంఎల్ఎల మద్దతు ఉంది. అందుకే జార్కి హోళి, డికె శివకుమార్‌కు తాను మద్దతు ప్రకటించలేదు. వాల్మీకి (ఎస్‌టి) వర్గానికి చెందిన బలమైన నేతగా అధిష్టానం తనను సిఎంగా ప్రకటిస్తుందన్న ఆశ ఆయనలో బలంగా ఉంది. శివకుమార్, మల్లికార్జున ఖర్గే, జార్కి హోళి ప్రస్తుతం సిఎం రేసులో ఆశావహులుగా ఉన్నారు. దళిత వర్గ ప్రజలు, వాల్మీకి గురుపీఠ స్వామీజీ ప్రసన్నానంద మాత్రం జార్కిహోళికే తన మద్దతు ప్రకటించారు. వీరిలో అధిష్టానం ఎవరిని ఎంపిక చేస్తుందో వేచిచూడాలి. కాంగ్రెస్‌యేతర ప్రభుత్వాలను ఏదో మిషతో కూల్చివేయాలని బిజెపి కంకణం కట్టుకుంది. గత పదేళ్ళలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలను తనకు స్వయంగా బలం లేక పోయినా విపక్ష ఎంఎల్ఎలను ప్రలోభపెట్టో, దర్యాప్తు సంస్థలతో భయపెట్టో రెండుగా చీల్చి ఆ ప్రభుత్వాలను పడగొట్టిన చరిత్ర బిజెపిది. మరోసారి కర్నాటక కాంగ్రెస్‌పై తన పంజా విసిరింది. 'ముడా' స్కాంలో సిద్దరామయ్యను విచారణకు గవర్నర్ వ్యవస్థను మరోసారి బిజెపి దుర్వినియోగ పర్చింది. అందుకే కర్ణాటక గవర్నర్ బిజెపి పెద్దలు చెప్పినట్లు విచారణకు అనుమతి ఇచ్చారు. ఇలాంటి సమయంలోనే కాంగ్రెస్ అధిష్టానం సిద్దరామయ్యకు అండగా నిలబడాలి. కర్ణాటక కాంగ్రెస్‌లో సిఎం పదవి కోసం నాయకుల మధ్య చీలికలు రాకుండా చూసుకోవాలి. షాడో సిఎంలను ప్రోత్సహించే సంస్కృతిని కాంగ్రెస్ అధిష్టానం మానుకోవాలి.

# కార్యకర్తల కుటుంబానికి అండగా ఉంటా

♦ కార్యకర్తల భౌతికకాయానికి నివాళులర్పించిన కేశం నాగరాజుగౌడ్



అమరచింత, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): అమరచింత మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చాంద్ పాషా మరియు హనుమంతు అనారోగ్యం కారణం చేత మృతి చెందారు. మంగళవారం వారి మరణవార్త తెలుసుకున్న టిపిసిసి అధికార ప్రతినిధి కల్లుగీత సెల్ రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ వారి భౌతిక కాయానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇట్టి కార్యక్రమంలో వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆయుబ్ ఖాన్, అమరచింత పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్యామ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# పోలీస్ స్టేషను అకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

■ పోలీస్ స్టేషన్లో రికార్డులు పరిశీలన
■ పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి
■ సీసీ కెమెరాలు అవగాహనపై మెరుగైన కార్యక్రమాలు చేపట్టాలి
■ జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపిఎస్



ఆత్మకూర్, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండల పోలీస్ స్టేషన్లో వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మంగళవారం రోజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు స్టేషన్ పరిసరాలను పరిశీలించి పోలీస్ స్టేషన్లో పరిశుభ్రత పాటించాలని మరిన్ని మొక్కలు నాటాలని సూచించారు పోలీస్ స్టేషన్లో రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలో ఎలాంటి దొంగతనాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని రోడ్డు ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలకు సైబర్ నేరాలపై బాల్యవివాహాలు స్త్రీలపై లైంగిక వేధింపులు మొదలగు వాటిపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని సూచించారు.

**ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి**

మండల పరిధిలోని ఆయా గ్రామాలలో జరగబోయే గణేష్ ఉత్సవాలకు సంబంధించి గణేష్ మండపాల నిర్వహణతో తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలను పలు సూచనలు తెలియజేశారు ప్రశాంత వాతావరణం లో పండుగ జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటన చూసుకోవాలని ఆయన అన్నారు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో సిసిటివి కెమెరాలు ప్రజల సహకారంతో ఏర్పాటు చేయాలని తద్వారా నేరాల నియంత్రణకు జరిగిన నేరాలను ఛేదించుటకు ఉపయోగపడతాయని సీసీ కెమెరాలు యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలిసే విధంగా పలు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆయన ఈ సందర్భంగా పలు సూచనలు సలహాలు తెలియజేశారు అనంతరం ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న సిబ్బంది ఒక పనితీరును అడిగి తెలుసుకుని ఏదైనా సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ తెలిపారు ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ శివకుమార్,సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్ పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్ని తాకిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు





వనపర్తి నియోజకవర్గం, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో మంగళవారం, యాదవ సోదరుల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి జన్మదిన సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కృష్ణాష్టమి రోజున వూయలలో కృష్ణుడి ప్రతిమను ఉంచి కనులపండువగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి విగ్రహాన్ని భజన కీర్తనలతో ఊరేగింపు చేసి పూజలు నిర్వహించారు. గ్రామస్థులు తమ చిన్నారులను కృష్ణుడు, గోపికల వేషధారణలతో అందంగా అలంకరించి, కృష్ణుడు వేషధారణలో బాలిక కృష్ణుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ముగింపు ఘట్టంగా నిర్వహించి సహపంక్తి భోజనాలతో వేడుకలను ముగించారు. ఉట్టికొట్టే కార్యక్రమం లో అందరూ కలిసి పాల్గొనడం వారిలోని ఐక్యతను పెంచుతోంది. అని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి గోశాల వ్యవస్థాపకుడు ఏర్పుల రాంవిరాట్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ గోపాల కృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడు గూడెం భీమన్న యాదవ్, వైస్ ప్రెసిడెంట్ నక్క శివకుమార్ యాదవ్, భజనపరులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

• డిఎల్పిఓకి వినతి పత్రం అందజేత
• ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు శ్రీహరి



ఆత్మకూర్, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలని మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం లో డీపీవో ఆఫీస్ లో డి ఎల్ పి ఓ కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు శ్రీహరి. జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు ప్రతినెల మొదటి వారంలోని జీతాలు చెల్లించాలని కార్మికులకు కనీస వేతన 26,000 ఇవ్వాలని పిఎఫ్. ఈఎస్ఐ.సౌకర్యం కల్పించాలని. కార్మికులకు గుర్తింపు కార్డులు గ్రామపంచాయతి ద్వారా ప్రభుత్వమే ఇవ్వాలని. విధి నిర్వహణలో మరణించిన కార్మికులకు 40 లక్షలు చెల్లించాలని. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని. గ్రామపంచాయతీ కార్మికులకు పెనుబారంగా శాపంగా మారిన మల్టీ పర్పస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని. వారాంతపు సెలవులు ఇవ్వాలని. చదువుకున్న గ్రామపంచాయతీ కార్మికులకు ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులపై రాజకీయ వేధింపులు. అక్రమ తొలగింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ గ్రామపంచాయతీ కార్మిక సంఘం నాయకులునారాయణ శాంతన్న శ్రీను మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రను ఎలుగెత్తి చాటాలి

– సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య

రంగారెడ్డి : ప్రజానాట్యమండలి శౌర్య యాత్ర చారిత్రక వాస్తవాలను ప్రజలకు వివరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లిలో సోమవారం ప్రజా నాట్యమండలి (పీఎన్ఎం) శౌర్య యాత్ర కళారూపాల శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రస్తుత పరిస్థితుల్లో పీఎన్ఎం పాత్రను వివరించారు. ఏ ఏ అంశాలపై కళారూపాలు ఉండాలో, వాటి ప్రాధాన్యతను వివరించారు. ఏ అంశం వివరించినా ప్రజలకు అర్థమయ్యే విధంగా.. కండ్లకు కట్టినట్టు చెప్పాలన్నారు. పలు సాంస్కృతిక అంశాలపై సుదీర్ఘంగా వివరించారు. పీఎన్ఎం నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం గురించి ప్రత్యేక కళారూపాలు రూపొందించనున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని శౌర్య యాత్ర చేపట్టనున్నట్టు తెలిపారు.

# రాంకీ అక్రమ కట్టడాలను కూల్చివేత



– కాప్రా తహశీల్దార్
– కాప్రా తహశీల్దార్ సుచరితా

జవహర్ నగర్, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): నిబంధలను విరుద్ధంగా రాంకీ యాజమాన్యం అక్రమ కట్టడాలు చేయడం సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని కాప్రా తహశీల్దార్ సుచరితా హెచ్చరించారు. జవహర్ నగర్ కార్పొరేషన్లోని డంపింగ్ యార్డ్ రాంకీ యాజమాన్యం ప్రధాన రహదారిని ఆక్రమిస్తు అక్రమ కట్టడాలు చేపట్టింది. విషయం తెలుసుకున్న కాప్రా తహశీల్దార్ సుచరితా ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో కలిసి అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఓ స్రవంతి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వీరేంద్రసాయి, సిబ్బంది పాండు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు పండుగ



దేవరకద్ర ,ఆగస్టు 27( తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని తీర్మాలయాపల్లి, దంతనూరు మరియు వివిధ గ్రామాలలో మంగళవారం పోచమ్మ బోనాల పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. గ్రామాల్లో ప్రతీ ఇంటి నుంచి బోనాన్ని ఎత్తుకొని మహిళలు ఆలయానికి బయల్దేరారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు.గ్రామస్తులంతా పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. వర్షాలు బాగా కురిపించి ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని బోనాల నైవేద్యాన్ని సమర్పించారు. అంటువ్యాధుల బారి నుంచి ప్రజలను కాపాడు తల్లీ అంటూ పోచమ్మను భక్తి శ్రద్ధలతో కొలిచారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని, పంటలు బాగా పండాలని వేడుకున్నా రు.

# మృతుడి కుటుంబానికి చల్లా పరామర్శ



పరకాల, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): హన్మకొండ జిల్లా పరకాల నియోజకవర్గంలో మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి తండ్రి రాజయ్య కొద్దిరోజులక్రితం అనారోగ్యంతో మృతిచెందడం జరిగింది. మంగళవారం రోజున పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా పరకాల పట్టణంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి అంచురి ప్రదీప్,ఏకు సిద్దు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట స్థానికి పరకాల పట్టణ ప్రజాప్రతినిధులు, భారత రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, మహిళ నాయకురాల్లు తదితరులు ఉన్నారు.

# ఆర్టీసీలో పెండింగ్ లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి

–నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన ఆర్టీసీ ఉద్యోగులు

మంథని ఆగస్టు 27: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో పెండింగ్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంథని ఆర్టీసీ బస్సు డిపోలో ఉద్యోగులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. టీజీఎస్ ఆర్టిసి జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టామని ఉద్యోగులు తెలిపారు. అలాగే గతంలో పెండింగ్లో ఉన్న పే స్కేల్ ప్రకటించాలని, బాండ్ పైసలు ఇప్పించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని మంథని డిపో ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎంయూ డిపో సెక్రటరీ వెంగళదాసు ఐలయ్య, కెకె.రెడ్డి, ఇకెఎం రావు , జనార్ధన్, మహేందర్, ఏసుమని లతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# మోటార్లు దొంగతనం చేస్తున్న దొంగల అరెస్ట్

◆ 26 కేసుల్లో 4 గురు దొంగలు, మోటార్లు కొనుగోలు చేస్తున్న వ్యక్తిని అరెస్ట్

◆ సిబ్బందిని అభినందించిన ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

గరిడేపల్లి, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పర్రెడ్డిగూడెం గ్రామం వద్ద జరిపిన వాహన తనిఖీలలో పట్టుబడిన మోటార్ల దొంగలు. సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం రోజు తన కార్యాలయంలో అందించిన వివరాల ప్రకారం 26 కేసుల్లో 4.34 లక్షల విలువగల 31 మోటార్లు, 135 మోటార్ల నుండి దొంగిలించిన మోటార్ కోర్ (కాఫర్ వైర్) అమ్మగా వచ్చిన 10.01 లక్షల నగదు సీజ్. ఆటో, 3 బైక్ లు, సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకోవడం జరిగింది. గరిడేపల్లి, మఠంపల్లి, హుజూర్నగర్, పాలకవీడు, చిలుకూరు, మేళ్లచేరువు పోలీసు స్టేషన్ ల పరిధిలో మోటార్లు దొంగతనం కు సంభందించి 26 కేసులు నమోదు చేయడం జరిగింది. కోదాడ సబ్ డివిజన్ పరిధిలో రైతులు బావులపై, వాగులపై, చెరువు లపై, వ్యవసాయ నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్న మోటార్లు మరియు మోటార్ కోర్ లు (కాఫర్ వైర్) దొంగతానులు చేస్తున్న దానిపై పోలీసు సిబ్బంది అప్రమత్తమై నిఘా ఉంచడం జరిగినది. కేసుల దర్యాప్తు లో భాగంగా సోమవారం రోజు గరిడేపల్లి పోలీసులు మండల పరిధిలో కల్మలచెరువు రోడ్డు లో పరెడ్డిగూడెం స్టేజి వద్ద వాహనాలు తనికి చేస్తుండగా ద్విచక్రవానంపై ఉన్న ఇద్దరు వ్యక్తులు ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఉప్పతల వాసు (ఎ1), మఠంపల్లి మండలానికి చెందిన వేముల కోటేశ్వర్ రావు (ఎ2) పోలీసు వారిని గమనించి తప్పించుకోవాలని ప్రయత్నించగా అనుమానాస్పదంగా ఉన్న వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఇరువురి వద్ద 5 లక్షల నగదు ఉన్నది, దీనిని విచారించగా వారు మోటార్లు, మోటార్ కోర్ వైర్ దొంగతనం చేసి అమ్ముతున్నట్లు గుర్తించడం జరిగినది. మోటార్ కోర్ అమ్మిన డబ్బులు అకారపు వెంకటి (ఎ3), అజ్మీర మంత్రియ (ఎ4) నలుగురము గత సంవత్సరము నుండి దొంగతనాలు చేసి అమ్మిన సొత్తును మట్టంపల్లికి చెందిన పాతసామాను వ్యాపారి ఏ5 శ్రీను వద్ద ఉంచి ఈరోజు పంచుకుని తీసుకువెళుతున్నాము అన్నారు. ఏ1, ఏ2 లు తెలిపిన వగ్మూలం ఆధారంగా నిఘా ఉంచు కాసారిగూడెం వద్ద అకారపు వెంకటి (ఎ3), అజ్మీర మంత్రియ (ఎ4) వేరువేరు బైక్స్ పై వస్తుండగా పట్టుకుని వీరి నుండి 3.81 లక్షల నగదు స్వాదినం చేసుకోవడం జరిగినది. వీరి ఒప్పుకొలు ఆధారంగా మటంపల్లి లోని పాతసమాను వ్యాపారి ఎ5 శ్రీను వద్ద 1.20 లక్షల నగదు స్వాదినం చేసుకోవడం జరిగినది. మొత్తం 10 లక్షల 1 వేయి నగదు సీజ్ చేశారు. పోలీసు వారి నిఘా ఉన్నందున వైర్ అమ్మిన డబ్బు మొత్తం వ్యాపారివద్దే ఉంచి పంచుకుని వెళ్ళే క్రమంలో పోలీసు పట్టుబడి చేశారు. ఈ మొత్తం నగదు 135 మోటార్ల నుండి దొంగిలించిన వైండింగ్ కాఫర్ వైర్ అమ్మగా వచ్చినది అని ఒప్పుకున్నారు. అలాగే 4,34,000/- విలువ గల 31 మోటార్ లు సీజ్ చేయడం జరిగినది. అలాగే దొంగతనానికి ఉపయోగించే ఆటో, 3 బైక్, సెల్ ఫోన్స్ సీజ్ చేశారు.





ఆంధ్ర రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఉప్పతల వాసు (ఎ1), మఠంపల్లి మండలానికి చెందిన వేముల కోటేశ్వర్ రావు (ఎ2), అకారపు వెంకటి (ఎ3), అజ్మీర మంత్రియ (ఎ4) నలుగురు వ్యక్తులు జల్సాలకు అలవాటుపడి ఎలాగైనా డబ్బులు సంపాదించడం కోసం నలుగురు కలిసి హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలో గత సంవత్సర కాలం నుండి నుండి గరిడేపల్లి, హుజూర్నగర్, మట్టంపల్లి, మేళ్లచెరువు, పాలకవీడు, చిలుకూర్ పోలీసు స్టేషన్ ల పరిధిలో వ్యవసాయ బావులపై మరియు వాగులపై, చెరువులపై రైతులు నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్న విద్యుత్తు మోటార్ లను దొంగిలించడం కోసం పగటిపూట రక్కి చేసి మోటార్ లు ఎక్కడ ఉన్నావో గుర్తించి అదే రోజు రాత్రి కానీ తెల్లారి కానీ అర్ధరాత్రి బైక్ మరియు ట్రాలి ఆటొ పై వచ్చి వీలు అయితే మోటార్ లు ఎత్తుక వెళ్లడం లేదా మోటార్ లోని వైండింగ్ కోర్ ఎత్తుక వెళ్ళి వాటిని మట్టంపల్లి గ్రామానికి పాత ఇనుము వ్యాపారి గడగంట్ల శ్రీను కు అమ్మి అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నారు.

ఎ-1 ఉప్పతల వాసు వృత్తి: కూలీ, నివాసం: ముప్పాళ్ళ గ్రామం చందర్లపాడు మండలం యన్టీఆర్ జిల్లా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం.

ఎ-2 వేముల కోటేశ్వర్ రావు వృత్తి: రాయికొట్టే పని (కూలీ), నివాసం: రఘునాథపాలెం గ్రామము, మటంపల్లి మండలం.

ఎ-3 అకారపు వెంకటి వృత్తి: కూలి, నివాసం: గుండ్లపల్లి గ్రామము, మటంపల్లి మండలం.

ఎ-4 అజ్మీర మంత్రియ వృత్తి: కూలి, నివాసం: సుల్తాన్ పురం తండా గ్రామము, మటంపల్లి మండలం.

ఎ-5 గడగంట్ల శ్రీను వృత్తి: పాత ఇనుము వ్యాపారం, నివాసం:, మటంపల్లి గ్రామం మరియు మండలం. నిందితుల గత నేర చరిత్ర ఎ-1 తెలంగాణ నుండి అక్రమంగా మద్యం తరలిస్తుండగా ఎన్టిఆర్ జిల్లా వత్సవాయి పి యస్ లో క్రైమ్ నెంబర్. 453/2020 యు/ఎస్ 34 (ఎ) ఏపీ ఎక్సైజ్ యాక్ట్ గా కేస్ నమోదు అయినది. ఎ-3 పై మట్టంపల్లి పి యస్ పరిధిలో నేరం సంఖ్య 100/2012 హత్య కేస్, ఎ-5 పై క్రైమ్ నెంబర్. 106/2007 యూ/ఎస్ 379 ఐపీసీ కేస్, అక్రమ ప్రజాపంపిణీ బియ్యం కలిగి ఉండగా క్రైమ్ నెంబర్. 74/ 2024 యూ/ఎస్ 420 ఐపీసీ, 7 అఫ్ ఈసీ యాక్ట్ ప్రకారం గా కేస్ నమోదు అయినవి. ఎ1 ఉప్పతల వాసు పై ఆంధ్రాలో వత్సవాయి పీఎస్ లో 453/2023 అక్రమ మద్యం కేసు, ఏ2 వేముల కోటేశ్వరరావు పై మఠంపల్లి పీఎస్ లో హత్యకేసు, ఏ5 గడగంట్ల శ్రీను పై పిడిఎస్ రైస్ కేసు తరలింపులో 2 కేసులు ఉన్నాయి. ఈ కేస్ ను చేధించిన హుజూర్ నగర్ సి ఐ జి. చరమందరాజు, గరిడేపల్లి యస్ఐ సిహెచ్ నరేష్, ఎస్ఐ సైదులు ఐడి పార్టీ సిబ్బంది కానిస్టేబుల్ నాగరాజు, శ0భయ్య, రామారావు లను జిల్లా ఎస్పి అభినందించారు.

# కుక్కలు బాబోయ్ కుక్కలు



■ ఇండ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్న జనం

■ ఏ వీధి చూసిన దర్శనమిస్తున్న గ్రామ సింహాలే

■ గ్రామసింహాల నుంచి రక్షించండంటూ వేడుకుంటున్న ప్రజానీకం

ఆత్మకూరు, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలో ఎక్కడ చూసినా కుక్కలు సైర విహారం చేస్తున్నాయని గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా కుక్కలు కనబడుతుండటంతో స్కూల్ కి వెళ్లే పిల్లలను కుక్కలు ఏమి చేస్తాయో అని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ కుక్కల బెడదను అరికట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# గుంటిపల్లి గ్రామంలో ఘనంగా పోచమ్మ పండగ



ఆత్మకుర్, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం గుంటిపల్లి, మోట్లంపల్లి గ్రామంలో మంగళవారం రోజు ఘనంగా పోచమ్మ పండగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి గొర్రె పొట్టేళ్లతో సమర్పించి,తమ తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కాకతీయ వైభవాన్ని చాటి చెప్పే అద్భుతం కోటగుళ్లు

– ఘనపేశ్వరాలయంను పర్యటించిన గవర్నర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా, గణపురం గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్ల గణపేశ్వరాలయాన్ని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సందర్శించారు. జిల్లాకు విచ్చేసిన గవర్నర్ కు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసులచే గౌరవ వందనం స్వీకరించిన గవర్నర్ కు వేదపండితులు పూర్ణ కుంభం, మేళా తాళాలతో స్వాగతం పలికారు. శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు బలరాం నాయక్, భద్రాచలం శాసన సభ్యులు డాక్టర్ తెల్లం వెంకట రావులతో కలిసి గవర్నర్ జిష్ణు





దేవ్ వర్మ గణపేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు శాలువాతో సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం గణపేశ్వారాలయం ఆవరణలో తవ్వకాలలో బయటపడ్డ శిల్పాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ కాకతీయుల వైభవాన్ని చాటే గొప్ప కట్టడం ఘనపేశ్వరాలయం అని, సుమారు 12వ శతాబ్దంలో కాకతీయులు ఓరుగల్లు ప్రాంతాన్ని పాలించిన సమయంలో ప్రజల సౌకర్యార్థం అద్భుతమైన కట్టడాలను నిర్మించారని అన్నారు. కాకతీయులు ఇతర రాజ్యాల పై దండయాత్ర చేసి సాధించిన విజయానికి గుర్తుగా ఒక్కొక్క గుడిని నిర్మించారని తెలిపారు. కాకతీయుల కళా సంపదను కాపడాల్సిన బాధ్యత అందరిపై ఉందని గవర్నర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే నాయిని

– ప్రభలుతున్న విషజ్వరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

– పేద ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి ప్రత్యేక శ్రద్ధ ఉంది

– వారానికి రెండు రోజులు డివిజన్లో వైద్య శిబిరాలకు ఆదేశాలు

హన్మకొండ, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): వర్షాకాలంలో ప్రధాకరమైన దోమల విహారంతో ప్రభలుతున్న విషజ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్య సిబ్బంది వార్డులలో పర్యటిస్తూ జ్వర పరీక్షలు చేయాలనీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం రోజున 52వ డివిజన్లోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. వైద్య శిబిరంలో జరుగుతున్న పరీక్షలను నిశితంగా పరిశీలించారు. ఉచిత వైద్య శిభిరాలను నియోజకవర్గ పరిధిలో అన్ని వార్డుల్లో నిర్వహించేల చూడాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు. ఉచిత శిబిరాలను ప్రజలందరూ





సద్వినియోగం చేసుకునేలా ముందస్తు ప్రణాళికను విడుదల చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే అలిపుర బడి మసీద్ కాలనీలో అధికారులతో కలిసి పర్యవేక్షించారు వార్డులో ఉన్నటువంటి సమస్యలను నేరుగా ప్రజల్ని అడిగి తెలుసుకుంటూ సాగారు. ప్రధాన సమస్యగా ఉన్న డ్రైనేజ్ అంతర్గత రోడ్ల నిర్మాణాలు, పేరుకుపోయిన చెత్త చెదారం పట్ల ఆసహనం వ్యక్తం చేశారు.మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు వార్డులలో పర్యటించాలని చెత్తాచెదారం పట్ల ఉపేక్షించేది లేదన్నారు. వార్డు పర్యాటంలో ఇల్లు లేవని కోరిన మహిళలకు త్వరలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. యుద్ధ ప్రాతిపదికన సైడ్ డ్రైన్ నిర్మాణం మరియు కమ్యూనిటీ హాల్ మిగిలిన పనుల కోసం అంచనాలు వేసినా తీసుకోవస్తే తక్షణమే నిధులు మంజూరి ఇస్తానని తెలిపారు. ఇప్పటికే తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలులో జరుగుతున్న అక్కడక్కడా వస్తున్న అభ్యర్థనలను అధికారులు మరియు స్థానిక నాయకులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం త్వరగతిన పూర్తి చేసి,కాలనీ మహిళలకు అందుబాటులోకి ఉంచుతామాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాలనీవాసులు అధికారులు పాల్గొన్నారు.

# హైడ్రాకు మరిన్ని అధికారాలు...

హైదరాబాద్: హైదరాబాద్‌ను గత ప్రభుత్వం విశ్వనగరంగా తీర్చిదిద్దింది. ఇందుకోసం మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రత్యేక చొరవతో అభివృద్ధి చేశారు. దీంతో పెట్టుబడులు భారీగా వచ్చాయి. ఐటీరంగం గణనీయంగా అభివృద్ధి చెందింది. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హైదారాబాద్ అభివృద్ధిపైనే ప్రధానంగా దృష్టిపెట్టింది. ఎన్నికల్లో జీహెచ్ఎంసీ పరిధిలో ఒక్క సీటు గెలవకపోయినా.. రాష్ట్ర రాజధానిని ఫ్యూచర్ సిటీగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా ఇటీవలే అమెరికా, దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లొచ్చారు. భారీగానే పెట్టుబడులు వచ్చేలా ఎంవోయూ చేసుకున్నారు. ఇదిలా ఉంటే.. హైదరాబాద్‌కు పెట్టుబడులు రావాలంంటే.. ముందుగా ముంపు సమస్య తొలగిపోవాలని భావించారు. అందుకు కబ్జాలే కారణమని గుర్తించారు. ఈ క్రమంలో వందలాది చెరువులను కబ్జాల చెర విడిపించాలని నిర్ణయించారు. ఇందుకోసం హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్సిబుల్ అసెట్) ఏర్పాటుచేశారు. పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. దీంతో నెల రోజులుగా హైడ్రా పని మొదలు పెట్టింది. రాజకీయ నాయకులు, అధికార పక్షం, ప్రతిపక్షం, సెలబ్రిటీలు అనే తేడా లేకుండా కబ్జాలను కూల్చివేస్తోంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలోని ఆక్రమణలను తొలగిస్తోంది. భవనాలను నేలమట్టం చేస్తోంది. తాజాగా ప్రముఖ సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేసింది. మరోవైపు జన్వాడలోని కేటీఆర్ ఫామ్ హౌస్‌గా భావిస్తున్న భవనాన్ని కూల్చేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో కేటీఆర్ స్నేహితుడు హైడ్రాపై కోర్టును ఆశ్రయించాడు. దీంతో కోర్టు హైడ్రా పరిధి, అధికారాలు, చట్టబద్ధతను ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో హైడ్రాకు మరింత పవర్ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.'హైడ్రా అనేది ఒక కార్యనిర్వాహక వ్యవస్థ. ఇది జీవో నెం.99 ద్వారా ఏర్పడింది. జులై 19న ఇది జీవో వచ్చింది. జీవోలకు సహజంగానే చట్టబద్ధత ఉంటుంది. గతంలో ఇదే విధంగా 1985లో ఒక జీవో ద్వారా ఏసీబీ ఏర్పడింది. అదే విధంగా జీవో ద్వారా విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ వ్యవస్థ కూడా ఏర్పడింది.

ఇలా జీవో ద్వారా ఏర్పడిన సంస్థలకు రాజ్యాంగ పరంగా కార్యనిర్వాహక అధికారం ఉంటుంది. గతంలో ప్లానింగ్ కమిషన్, లా కమిషన్ కూడా ఇలాగే కార్యనిర్వాహక ఆదేశాలతో ఏర్పడ్డాయి. జీవోల ద్వారా ఏర్పడిన వ్యవస్థలకు చట్టబద్ధత ఉండదు అనడానికి లేదు. ఆక్రమణల తొలగింపు అనేది స్థానిక సంస్థల భాగస్వామ్యంతో చేపట్టాలన్నది హైడ్రా జీవోలోనే ఉంది. ఆ ప్రకారమే ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను తొలగిస్తుంది.బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. హైడ్రాకు పోలీస్ స్టేషన్ స్టేటస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనివల్ల నేరుగా హైడ్రానే ఎఫ్ఐఆర్ ఫైల్ చేసేందుకు వెసులుబాటు కలుగుతుంది. దీనిపై ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడనున్నట్లు సమాచారం. ఇక హైడ్రా కూల్చివేసిన భవనాలకు గతంలో పర్మిషన్ ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకునే విషయంపై ఉన్నతాధికారులతో ప్రభుత్వం చర్చలు జరుపనుంది.

# గవర్నర్, మంత్రి-సీతక్క లను కలిసిన కాంగ్రేస్ పార్టీ నాయకులు

– రామప్పను మొదటిసారిగా సందర్శించిన గవర్నర్

– సకల లాంఛనాలతో స్వాగతం పలికింది జిల్లా ప్రజానీకం

వెంకటాపూర్, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): మంగళవారం వెంకటాపూర్ మండలంలోని యునెస్కో గుర్తింపుపొందిన రామప్ప దేవాలయాన్ని సందర్శించడానికి వచ్చిన రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మరియు రాష్ట్ర మంత్రి సీతక్కని కాంగ్రేస్ పార్టీ నాయకులు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, పీసీసీ మెంబర్ మల్లాడి రాంరెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రేస్ అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, జిల్లా యూత్ అధ్యక్షులు బానోత్ రవిచందర్, ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షులు మామిడిశెట్టి కోటి, బ్లాక్ అధ్యక్షులు బైరెడ్డి భగవాన్ రెడ్డి, ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షులు పల్లె జయపాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మిల్కూరి ఐల్లయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్ కిసాన్ కాంగ్రేస్



ప్రధాన కార్యదర్శి నూనెటి శ్యామ్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి జక్కుల రేవంత్, కిసాన్ కాంగ్రేస్ ములుగు మండల అధ్యక్షులు వాకిటి రామకృష్ణ రెడ్డి, కాంగ్రేస్ పార్టీ నర్సాపూర్ సీనియర్ నాయకులు బొచ్చు సమ్మయ్య లు మరియు జిల్లాలోని రాష్ట్ర, జిల్లా నాయకులు, మండల నాయకులు, అనుబంధసంఘాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు కలిసి షాలువాకప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వకంగా పలకరించారు.

# రోడ్డును ఆక్రమించుకుంటున్న బైకులు.. పట్టించుకోని అధికారులు

**♦ స్టేట్ బ్యాంక్ వద్ద పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి**



ఆత్మకూర్, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ఎస్బిఐ బ్యాంకు దగ్గర పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఖాతాదారులు తమ వాహనాలను ఆత్మకూరు లోని ప్రధాన రహదారి తమ బైకులను పార్కింగ్ చేస్తూ బ్యాంకుకు వెళ్తున్నారు. దీంతో ప్రధాన రహదారులకు బస్టాండుకు వెళ్లే బస్సులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. కావున సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని తమ సమస్యలను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు. ఇది సమస్య పరిష్కారం కాకపోతే వాహనదారులకు చాలా ఇబ్బంది కలుగుతుంది ఆత్మకూరు పట్టణంలో అన్ని బ్యాంకుల కంటే అత్యధిక ఖాతాదారులు గల బ్యాంకు ఎస్బిఐ దీనిపై ప్రత్యేక అధికారులు స్పందించి ఎస్బిఐ బ్యాంక్ ఆవరణంలో పార్కింగ్ స్థలాని కేటాయించాలని వాహనదారులు, ఆర్టీసీ డ్రైవర్లు కోరుతున్నారు.

# ఘనంగా కృష్ణ భగవానుడి ఊరేగింపు దిగ్విజయం

వనపర్తి నియోజకవర్గం, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): కృష్ణం వందే జగద్గురుమ్ త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యం వనపర్తి జిల్లా పెద్దమందడి,మండలం లోని మద్దిగట్ల గ్రామంలో రెండవ రోజు మంగళవారం శ్రీ కృష్ణ ఊరేగింపు కార్యక్రమంలో మధ్యాహ్నం 2 నుండి 5 వరకు జరిగింది. గ్రామస్థులు అధిక సంఖ్య లో విచ్చేసి దైవదర్శనం చేసుకునీ ఊరెగింపు లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక మద్దిగట్ల కమిటీ అధ్యక్షుడు సభ్యులు రాఘవేంద్రాచారి,రవి కుమార్,మనోహర్, రమేష్, సుదర్శన్, యాది, శంకర్, మంజుల, సబిత, శిరీష, మాజీ ఎంపీపీ డాక్టర్ రఘు, నాగన్న, బుచ్చిలింగం, సుదర్శన్, కుమ్మరి బాలయ్య, పెద్దమందడి ఏఎస్ఐ హరిచంద్ర గౌడ్ గ్రామ యాదవులు తిరుపతయ్య నాగేష్ నాగన్న కృష్ణయ్య రాము సర్పంచ్ బసవ రాజు తదితరులు పాల్గొన్నారు.



# అవమానించిన పూజారిని వెంటనే అరెస్టు చేయాలి

**- బిజెపి దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాము డిమాండ్**



ఆత్మకూర్, ఆగస్టు 27 (తీన్మార్ న్యూస్): నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలో మూడుమల్ గ్రామంలో పూజారి చక్రపాణిని వెంటనే అరెస్టు చేసి ఉద్యోగం నుండి తొలగించాలని వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో స్థానిక ఆర్ అండ్ బి అతిథిగృహంలో వనపర్తి జిల్లా బిజెపి దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి బోరెల్లి రాము విలేకరుల సమావేశంలో ఆయన అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడుమల్ గ్రామంలోని రాఘవేంద్ర స్వామి మఠంలో పూజారిగా పని చేస్తున్న బ్రాహ్మణ కులానికి చెందిన చక్రపాణి అనే వ్యక్తి ఈనెల 18 వ తారీఖున మూఢమరు గ్రామంలో దళిత యువజంట ఓబులేష్ మరియు అంబిక వివాహాన్ని మూడమల్ గ్రామంలో రాఘవేంద్ర స్వామి మఠం లోపల జరగనివ్వకుండా మఠం బయటే చేసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తూ దళిత యువజన అవమానపరచడం జరిగిందని స్వయాన అతను ఒక ప్రభుత్వ ఉద్యోగి అయినప్పటికీ ఉద్దేశపూర్వకంగానే అగ్రకుల అహంకారంతో పూజారి చక్రపాణి ఆ దళిత యువజంట పెళ్లిని గుడిలో జరగనివ్వకుండా చేసిన పూజారి చక్రపాణిని వెంటనే అరెస్టు చేసి ఉద్యోగం నుండి తొలగించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

# వాన కాలం పంట నుండి రైతులకు బోనస్ ఇస్తాం

**ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు**

పెద్దపల్లి: మండలంలోని తుర్కలమద్ది కుంట గ్రామంలో మంగళవారం పెద్దపల్లి నుండి తుర్కలమద్దికుంట అలాగే తుర్కల మద్దికుంట నుండి కాచాపూర్ వరకు డబల్ రోడ్డు నిర్మాణంతో పాటు ఆంజనేయ స్వామి ఆలయం నుండి మద్దికుంట పాఠశాల చౌరస్తా వరకు 1200 మీటర్ల సి.సి రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్లు, సంబంధిత ఇంజనీరింగ్ శాఖ ఎ.ఈ, గ్రామస్తులతో కలిసి పనులను శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ గ్రామస్తుల అభిప్రాయం ప్రకారం 33 ఫిట్ల రోడ్డు వెడల్పుతో పాటు రెండు పక్కల డ్రైనేజీ నిర్మాణం కోసం గ్రామస్తుల ఆలోచనతో ముందుకు పోవడం జరుగుతుందని అన్నారు. రోడ్డు వెడల్పు లో భాగంగా 4 నుండి 5 ఇండ్లు సంబందించిన సమస్య ఉంటే తమ గ్రామ నాయకుల సహకారంతో డబల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేసి వారందరికీ నష్టం కాకుండా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులందరి ముందు ఆయన హామీ ఇచ్చారు.

గ్రామంలో ఉన్న సమ్మక్క- సారలమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా హనుమాన్ విగ్రహం నుండి కెనాల్ ద్వారా మేరపల్లి, తెనుగుపల్లి వెళ్లే మార్గంలో రోడ్డు నిర్మాణం కోసం ప్రపోసల్ చేసినట్లు తెలిపారు. దీంతో పాటు రాబోయే సమ్మక్క సారలమ్మ జాతర వరకు సి.సి రోడ్డు నిర్మాణం పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు.కాచాపూర్ నుండి మద్దికుంట మార్గం మధ్యలో ఉన్న 2 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం కోసం సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడం జరిగిందన్నారు. అలాగే ఎన్నికల సమయంలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ఇంటి ఇంటికి విజ్ఞన్న నినాదంతో మద్దికుంట గ్రామానికి వచ్చినప్పుడు గ్రామస్తులు రోడ్డు కావాలని అడగడంతో ఆరోజు ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు నిర్మాణం దసరా వరకు పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఏక కాలంలో రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వనిదని ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ 2 లక్షల రుణమాఫీ ప్రకటించారని ఎన్నికల హామీకి కట్టుబడి ఉండి రైతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు లక్షల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి రైతుకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసి తీరుతుందని ప్రతిపక్షాలు చేసే విమర్శలను రైతుల నమ్మకూడదని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్నిచోట్ల సాంకేతిక లోపాల వల్ల, మరికొన్ని చోట్ల బ్యాంకుల తప్పిదం వల్ల రైతులకు రుణమాఫీ అందలేదని వాటన్నిటిని సవరించి పూర్తిస్థాయిలో రుణమాఫీ అందజేస్తామని రైతులు నిరాశ చెందవద్దని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పాతాళ లోకంలో పడదేసిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు కొన్నిచోట్ల రైతుల ముసుగులో రుణమాఫీ ఆందోళనలు పాల్పడుతున్నా రని వారికి రైతులే తగిన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. రుణమా ఫీ పై తోడు దొంగలైన కేటీఆర్, హరీష్ రావులు అబద్దాలతో పోటీపడి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని అన్నారు. అలాగే కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతుల ప్రాణాల ను బలి తీసుకుందని విమర్శించారు. బిజెపి పార్టీ అధికారంలో ఉన్న ఏ ఒక్క రాష్ట్రంలో కూడా రుణమాఫీ చేయలేదని ఎద్దేవా చేశారు.. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ అక్రమణ సరే..

**జిల్లాల అక్రమణ సంగతీ ఏంటీ..?**

**జిల్లాల్లో అక్రమణకు గురి అవుతున్న చెరువులు, కుంటలు**

**హైడ్రా మాదిరి ఇక్కడి అక్రమణలు తొలగించాలి**

**చెరువులు, కుంటలను రక్షించాలి**

**బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు గొట్టెముక్కుల సురేష్ రెడ్డి**

పెద్దపల్లి: హైదరాబాద్ డిజార్టర్ మేనేజ్మెంట్ కమిటీ మాదిరి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్రమణకు గురి అవుతున్న చెరువులు, కుంటలను కాపాడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రావంటి టీంలను ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టె ముక్కుల సురేష్ రెడ్డి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పెద్దపల్లి జిల్లా పలువురు రాజకీయ ప్రముఖులు, వ్యాపారులు కలిసి చెరువులు కుంటలను కబ్జా చేస్తున్నారని సురేష్ రెడ్డి ఆరోపించారు. చెరువులు, కుంటలు, ఫుల్ ట్యాంట్ లెవల్ బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలు చేస్తు అక్రమిస్తున్నారని తెలిపారు.

జిల్లాలోని చెరువులు, కుంటలు కబ్జా కాకుండ చూడాలని ఇందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి ఇప్పటికే చెరువులు, కుంటల్లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు చెరువులు కుంటలు అక్రమణకు గురికాకుండ చూడాలని సురేష్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అందుబాటులోకి.. రైతు భరోసా యాప్..

**ట్రయల్ పూర్తి**

హైదరాబాద్: రైతు వివరాల ఎంట్రీ సమయంలో మూడు రకాల ఇబ్బందులు మాఫీ కాని రైతుల నుంచి ఫ్యామిలీ అఫిడవిట్ తీసుకోనున్న ఆఫీసర్లు మంగళవారం యాప్పై ప్రిన్సిపల్ సెక్రటరీ, అగ్రికల్చర్ డైరెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ బ్యాంకర్లు, ఆఫీసర్ల పొరపాట్ల వల్ల రుణమాఫీలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర సర్కారు సిద్ధమైంది. ఈ మేరకు రైతు భరోసా యాప్ ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ట్రయల్ పూర్తి కాగా, యాప్లో చేయాల్సిన మార్పు, చేర్పులపై మంగళవారం అన్ని జిల్లాల వ్యవసాయాధికారులతో ప్రిన్సిపల్ సెక్రటరీ, అగ్రికల్చర్ డైరెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. వీసీలో వచ్చిన సూచనలు, సలహాల మేరకు యాప్లో మార్పులు చేర్పులు చేయనున్నారు.

**మొదట ఫ్యామిలీ గ్రూపింగ్:**

రాష్ట్ర సర్కారు రూ. 2 లక్షలలోపు లోన్లు తీసుకున్న ప్రతి రైతు కుటుంబానికి రుణమాఫీ చేయాలని నిర్ణయించింది. ఈమేరకు పంద్రాగస్టులోపు రూ. 2 లక్షలలోపు లోన్లు తీసుకున్న రైతుల రుణాలను మాఫీ చేసింది. కానీ కొన్ని టెక్నికల్ సమస్య వల్ల చాలా మందికి రుణాలు మాఫీ కాలేదు. 31 రకాల ఇబ్బందుల వల్ల చాలా మందికి లోన్లు మాఫీ కాలేదని అగ్రికల్చర్ ఆఫీసర్లు గుర్తించి, ఆ రిపోర్టును ఇటీవల రాష్ట్ర సర్కారుకు అందించారు. ఇందులో ప్రధానంగా రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల వివరాలు తప్పుగా ఉండడం, అర్హుల పేర్లు రేషన్ కార్డుల్లో ఒకలా, ఆధార్ మరోలా ఉండడం.. ఆధార్ నంబర్లు తప్పుగా పడడం, అర్హుల పేర్లు ఆధార్లో ఒకలాగా, బ్యాంక్ అకౌంట్లో మరో లా పడడం లాంటి సమస్యలు ఉన్నాయి. వీటిని పరిష్కరించేందుకు రాష్ట్ర సర్కారు తొమ్మిది రోజుల్లోనే భరోసా యాప్ ను అందుబాటులోకి తెచ్చింది. మొదట యాప్లో రుణమాఫీ కాని రైతు కుటుంబ సభ్యుల వివరాలను ఫ్యామిలీ గ్రూపింగ్, ఎంట్రీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు గత శనివారం రాష్ట్రంలోని అన్ని మండలాల వ్యవసాయాధికారులు యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. వారి ఆదేశానుసారం యాప్ ను డౌన్లోడ్ చేసుకున్న మండల వ్యవసాయధికారులు. సర్కారు సూచనలు మేరకు ట్రయల్ నిర్వహించారు. ప్రతి మండలంలోని ఒక రైతు కుటుంబ వివరాలు ఎంట్రీ చేశారు.

**బ్యాంకర్ల నుంచి వివరాల సేకరణ..**

రుణమాఫీ కాని రైతుల వివరాలు మండల వ్యవసాయాధికారులకు అందజేయాలని రాష్ట్ర సర్కారు బ్యాంకర్లను ఆదేశించింది. దీంతో వారు రుణాలు మాఫీ కాని వివరాలను రెడీ చేసి మండల వ్యవసాయధికారులకు అప్పగించే పనిలో ఉన్నారు. ఒకటి రెండో రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. బ్యాంకర్లు ఇచ్చిన వివరాల ఆధారంగా యాప్ లాగిన్ ఉన్న మండల వ్యవసాయధికారులు ప్రతి గ్రామంలో పర్యటించనున్నారు. లిస్టులో ఉన్న పేర్ల ఆదారంగా ప్రతి రైతు ఇంటి వద్దకు వెళ్లి యాప్లో వివరాలు నమోదు చేయనున్నారు.

**అఫిడవిట్ తప్పనిసరి:**

జనరల్ ట్రాన్స్ఫర్స్ భాగంగా అగ్రికల్చర్ డిపార్ట్మెంట్లో ఇటీవల చాలా మంది ఆఫీసర్లు ఒక మండలం నుంచి మరో మండలానికి బదిలీ అయ్యారు. ఈ క్రమంలో కొత్తగా మండలానికి వచ్చిన ఆఫీసర్లకు ఎంక్వైరీ సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు రైతుల నుంచి ఫ్యామిలీ అఫిడవిట్లు తీసుకోవాలని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు రుణమాఫీ కాని రైతు తమ కుటుంబంలో ఎంత మంది ఉన్నారు? అనే వివరాలతో ఫ్యామిలీ అఫిడవిట్ను పంచాయతీ సెక్రటరీ లేదా గెజిటెడ్ ఆఫీసర్ సిగ్నేచర్ తో తీసుకోవాల్సి ఉంటుంది. ఈ సర్టిఫికెటు ను సర్వేకు వచ్చే ఆఫీసర్ కు అందించాల్సి ఉంటుంది. వారు ఈ సర్టిఫికెట్ ఫొటోలు తీసి, యాప్లో అప్లోడ్ చేస్తారు. ఇందుకు సంబంధించి రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రానున్నాయి. ఎంట్రీ సమయంలో ఆఫీసర్లకు మూడు రకాల ఇబ్బందులు, ఒక మండలానికి చెందిన రైతు ఆ మండలంలోని బ్యాంకులో కాకుండా మరో మండలంలోని బ్యాంకులో క్రాప్ లోన్ తీసుకొని ఉంటే యాప్లో ఆ రైతు వివరాలు ఎంట్రీ కావడం లేదు. యాప్లో రిలేషన్స్ ఆప్షన్లో కూతురు, కుమారుడు పేర్లు మాత్రమే డిస్ప్లేలో ఉన్నాయి. దీని వల్ల కోడళ్లు, అల్లుళ్లు, మనవళు ,, మనుమరాండ్లు, నాన్నమ్మ, తాతయ్య వంటి పేర్లు ఎంట్రీ చేయడానికి ఇబ్బందులు వస్తున్నాయి. భర్త పేరు మీద భూమి ఉండి ఆయన చనిపోతే ఆధార్ నంబర్ లేకపోవడం.. భార్య పేరు మీద భూమి ఉండి ఆమే చనిపోతే ఆధార్ నంబర్ లేకపోతే యాప్లోవివరాలు ఎంట్రీ కావడం లేదు.

# భారీగా డ్రగ్స్ పట్టివేత

**- సీజ్ చేసిన ఫ్యాక్టరీ నుంచి సేకరణ**

**- ముగ్గురు నిందితుల అరెస్ట్**

**- 8.5 కిలోల ఎఫిటమిన్ డ్రగ్స్ స్వాధీనం**

**- విలువ రూ. 8.5 కోట్లు**



సిటీ: కొద్ది నెలల కిందట సీజ్ చేసిన ఫ్యాక్టరీ నుంచి సేకరించిన ఎఫిటమిన్ డ్రగ్స్ను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురిని హైదరాబాద్ నార్కోటెక్ ఎన్ఫోర్స్మెంట్, బోయిన్పల్లి పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురు నిందితుల నుంచి రూ. 8.5 కోట్ల విలువైన ఏండీఏం, 8.5 కిలోల ఎఫిటమిన్ డ్రగ్స్తో పాటు కారు, మూడు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బంజారాహిల్స్లోని సీసీసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ కొత్తకోట శ్రీనివాస్రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు.

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలకు చెందిన కె.నాగరాజు మేస్త్రీగా పని చేస్తున్నాడు. సంగారెడ్డి సమీపంలోని బొంతపల్లికి చెందిన వ్యాపారి గోసుకొండ అంజిరెడ్డికి చెందిన ఫంక్షన్ హాల్స్, ఫ్యాక్టరీ, గోడౌన్లలో సివిల్ వర్క్స్ ఉన్నాయని తెలుసుకుని ఆయనను కలిశాడు. పనిచేసే సమయంలో అంజిరెడ్డితో సాన్నిహిత్యం పెరిగింది. ఆ సమయంలో అంజిరెడ్డి ఎఫిటమైన్ డ్రగ్స్ తయారు చేసి, ప్లాస్టిక్ వస్తువుల సరఫరా ముసుగులో నగరంలో పార్టీలు, పబ్స్, కల్లు దుకాణాలతో పాటు ఇతరులకు సరఫరా చేస్తున్నట్టు తెలుసుకున్నాడు. ఇద్దరి మధ్య చనువు పెరగడంతో డ్రగ్స్ సరఫరా చేయడం ప్రారంభిం చారు. అధిక లాభాలు వస్తుండటంతో పాటు డిమాండ్ పెరగడంతో మరో ఇద్దరిని పనిలోకి తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా సంగారెడ్డికి చెందిన ఏ.వినోద్కుమార్, కె.శ్రీశైలం అనే యువకులను తీసుకుని దందా కొనసాగిస్తున్నారు. ఇదిలావుండగా, అంజిరెడ్డి ఫ్యాక్టరీలో ఎఫిటమైన్ డ్రగ్స్ తయారు చేసి సరఫరా చేస్తున్నట్టు గుమ్మడిదల పోలీసులకు సమాచారం అందడంతో అతన్ని కొద్ది నెలల కిందట అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. అయితే, ఫ్యాక్టరీలో నిల్వ ఉంచిన ఎఫిటమైన్ డ్రగ్స్ను ఎలాగైనా బయట విక్రయించాలని నాగరాజు, వినోద్కుమార్, శ్రీశైలం నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ముగ్గురు జిన్నారం నుంచి డ్రగ్స్ను తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. బోయిన్పల్లి మీదుగా సికింద్రాబాద్ ప్యారడైజ్ వద్ద డెలివరీ చేసేందుకు కారులో వెళ్తున్నట్టు హెచ్న్యూ(హైదరాబాద్ నార్కోటిక్స్ వింగ్) పోలీసులు గుర్తించారు. బోయినపల్లి పోలీసుల సాయంతో డెయిరీ ఫామ్ రోడ్డు వద్ద నిందితుల వాహనాన్ని అడ్డుకుని తనిఖీ చేశారు. కారు డిక్కీలో ఎఫిటమైన్ డ్రగ్స్ను స్వాధీనం చేసుకున్నారు. దీనివెనుక ఇంకెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు సీపీ తెలిపారు.


**గంజాయితో అలవాటై డ్రగ్స్కు బానిసలుగా మారుతున్న యువత: సీపీ**

డ్రగ్స్ మొత్తం దేశాన్నే నష్టపరుస్తుందని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కొందరు యువకులు సరదా కోసం సిగరేట్తో మొదలు పెట్టి.. మద్యం, రెండో లెవల్లో గంజాయిని అలవాటుగా చేసుకుంటున్నారని, అక్కడి నుంచి డ్రగ్స్కు బానిసలవుతున్నారని తెలిపారు. కొందరు ఉగ్రవాదులు, సంఘ విద్రోహశక్తులు యువకులను తప్పుదోవ పట్టించడంతోపాటు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన యువతను చెడగొట్టి, డ్రగ్స్ మత్తులోకి లాగుతున్నారని తెలిపారు. యువకులు డ్రగ్స్కు అలవాటై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుం టున్నారని, తల్లిదండ్రులకు భారంగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారు? ఎవరితో స్నేహం చేస్తున్నారో తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. ఎక్కడికి వెళ్తున్నారో గమనించాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు సుధీంద్ర, రష్మీ పెరుమాల్, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా 1 నుంచి దేశవ్యాప్త నిరసనలు

**- పేదలు, మధ్యతరగతి ప్రజల జోలికి హైడ్రా వెళ్లొద్దు : సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ**



హైదరాబాద్: ప్రధాని మోడీ పాలనలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు వ్యతిరేకంగా వచ్చేనెల ఒకటి నుంచి ఏడో తేదీ వరకు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ ప్రకటించారు. 'హైడ్రా' పేరుతో అక్రమ కూల్చివేతలు పులి మీద స్వారీ లాంటివనీ, భయపడి సీఎం రేవంత్రెడ్డి వెనకడుగు వేస్తే ఆ పులి ఆయన్నే తినేస్తుందని చెప్పారు. ఎవరికీ భయపడకుండా ప్రలోభాలకు గురికాకుండా ముందుకెళ్తే ప్రజల మద్దతు లభిస్తుందన్నారు. అయితే పేదలు, మధ్యతరగతి ప్రజల జోలికి హైడ్రా వెళ్లొద్దని కోరారు. హైదరాబాద్లోని మఖ్దూంభవన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ బాలమల్లేష్తో కలిసి నారాయణ మాట్లాడారు. గవర్నర్ ద్వారా కర్నాటక ప్రభుత్వాన్ని దెబ్బకొట్టాలని మోడీ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ఇది ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతిస్తుందన్నారు. ఇలాంటి చర్యలు ప్రమాదకర మనీ, మోడీపై బీజేపీ తిరుగుబాటు చేస్తుందని హెచ్చరించారు. మోడీ వల్లే అదానీ ప్రపంచ కుబేరుడు అయ్యారని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలను కూలుస్తారా? అంటూ ఎంఐఎం నేత ప్రశ్నించడాన్ని నారాయణ తప్పుపట్టారు. ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే ప్రభుత్వ కార్యాలయాలకు, కబ్జాదారుల ఫామ్హౌజ్, ఫంక్షన్హాళ్లు, విద్యాసంస్థలకు ముడిపెడుతారా?అని ప్రశ్నించారు. ఈ అంశంలో ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించా లని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. బడాబాబుల అక్రమ కట్టడాలను కాపాడుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాలను సాకుగా చూపే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. పేదలు, మధ్యతరగతి ఇండ్ల స్థలాల జోలికి హైడ్రా వెళ్లొద్దని సూచించారు.వారి స్థలాలను క్రమబద్ధీకరిం చాలనీ, లేదంటే వారికి ప్రత్యామ్నాయం చూపాలని ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. చెరువు స్థలాల్లో ఉన్న వాణిజ్య, వ్యాపార కట్టడాలను తొలగిం చాలనీ,కబ్జాలకు పాల్పడిన బడాబాబుల నుంచి డబ్బులు వసూలు చేయాలని కోరారు.'ఎన్' కన్వెన్షన్ అంశంలో సినీనటుడు నాగార్జున నుంచి కూడా డబ్బులు వసూలు చేయాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్,పల్లా రాజేశ్వర్ రెడ్డి, సినీనటుడు నాగార్జున లాంటి వారు తాము చెరువుల్లో నిర్మించలేదనీ, టేపులతో కొలవాలని చెబుతు న్నారనీ, చెరువులనుకబ్జాచేసినఇంకా కొలవడంఏంటని ప్రశ్నించారు.

# ఆ రెండు చెరువులపై దృష్టి

## తుమ్మిడికుంటలో మల్లారెడ్డి వర్సిటీ
## నాదం చెరువులో అనురాగ్ వర్సిటీ

హైదరాబాద్: తమ్మిడి కుంట చెరువు విస్తీర్ణం 29.6 ఎకరాలు. ప్రస్తుతం అది పది ఎకరాలకు పడిపోయింది. దాదాపు 19 ఎకరాల చెరువు స్థలం కబ్జాకు గురైంది. అందులో కొంతమంది ఇళ్లు నిర్మించుకున్నారు. మరి కొంతమంది బహుళ అంతస్తులు ఏర్పాటు చేసుకున్నారు. ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేత నేపథ్యంలో వారిలో భయం మొదలైంది. ఇదే సమయంలో ఏం జరుగుతుందోననే ఆందోళన వ్యక్తం అవుతుంది. మరోవైపు చెరువుల్లో ఆక్రమణల కూల్చివేత నిరంతరం కొనసాగుతుందని హైడ్రాధికారులు చెబుతున్నారు. మేడ్చల్ జిల్లా పరిధిలోని మాజీ మంత్రి మల్లారెడ్డికి చెందిన కళాశాలలు, హాస్టళ్లు చెరువుల ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్, ప్రభుత్వ స్థలాల్లో నిర్మించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే మల్లారెడ్డి ప్రభుత్వ స్థలంలో ఆక్రమించి నిర్మించిన నిర్మాణాన్ని కూల్చివేయించారు. ఇప్పుడు ఎన్ కన్వెన్షన్ సెంటర్ ను పడగొట్టిన తర్వాత.. తదుపరి కూల్చివేతలు మల్లారెడ్డి కి సంబంధించిన నిర్మాణాలేనని పొలిటికల్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మల్లారెడ్డికి సంబంధించిన పలు నిర్మాణాలపై కోర్టు స్టేలు ఉన్నాయి. కాప్రా లోని మల్లారెడ్డికి సంబంధించిన ఒక నిర్మాణం ఉంది. అయితే దానిపై ఇటీవల స్టే వెకేట్ అయినట్టు తెలుస్తోంది. దీంతో చర్యలు తీసుకునేందుకు మేడ్చల్ అధికారులు సమాయత్తమవుతున్నారు.గత ఏడాది వానా కాలంలో మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆసుపత్రి లోకి వాన నీళ్లు వచ్చాయి. అప్పట్లో మల్లారెడ్డి పై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శలు చేశాయి. ముఖ్యంగా అప్పటి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పలు దస్త్రాలను విలేకరులకు అందించారు. మల్లారెడ్డి అనేక అక్రమాలకు పాల్పడి కళాశాలలు, ఇతర భవనాలు నిర్మించాలని ఆరోపించారు. దీనిపై కోర్టులో కేసులు కూడా వేశారు. ఆ సమయంలో మల్లారెడ్డి బహిరంగంగా రేవంత్ రెడ్డికి తొడ కొట్టి సవాల్ విసిరారు. ఆ తర్వాత ఏడాది గడవగానే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు.. ఆయన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు చెప్పినట్టుగానే ఇప్పుడు అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించి.. నేలమట్టం చేస్తున్నారు. మల్లారెడ్డి కి సంబంధించినవి ఇవి మాత్రమే కాకుండా మేడ్చల్, ఇతర ప్రాంతాలలో నిర్మించిన కళాశాలలు కూడా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి కట్టినవేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. అంతకుముందు సంవత్సరం ఐటీ అధికారులు మల్లారెడ్డి విద్యాసంస్థల్లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ కేసుకు సంబంధించి ఇప్పటికి కోర్టులో విచారణ కొనసాగుతోంది. మళ్లీ ఇప్పుడు ఆయన విద్యాసంస్థలపై హైడ్రా చర్యలు తీసుకుంటుందనే చర్చ జోరుగా సాగుతోంది.

వెంకటాపూర్ లో అనురాగ్

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి చెందిన విద్యాసంస్థలపై పోచారం ఐటిసి పోలీస్ స్టేషన్లో కేసు నమోదయింది. రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అనురాగ్ విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. అయితే ఆయన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనురాగ్ విద్యాసంస్థలు, గాయత్రి ఎడ్యుకేషనల్ ట్రస్ట్.. మేడ్చల్ జిల్లాలోని నాడెం చెరువు బఫర్ జోన్ లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టాయని నీటిపారుదల శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం వెంకటాపూర్ పంచాయతీలోని కొర్రెముల రెవెన్యూ పరిధిలోని 813 సర్వే నెంబర్లు ఈ విద్యాసంస్థలు వివిధ నిర్మాణాలు చేపట్టాయి. అయితే ఆ చెరువుకు 30 మీటర్ల బఫర్ జోన్ వదిలిపెట్టి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అయితే యాజమాన్యం ఆ నిబంధనను పక్కనపెట్టి నిర్మాణాలు చేపట్టింది.

ఈ క్రమంలో ఘట్కేసర్ మండల ఇరిగేషన్ ఏఈ పరమేష్.. ఈనెల 22న బఫర్ జోన్ లోని నిర్మాణాలను పరిశీలించారు. వాల్టా చట్టంలోని పలు సెక్షన్లను పేర్కొంటూ పోచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు నంగార భేరి లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ నాయక్ అనురాగ్ విద్యాసంస్థల ఆక్రమణలపై కలెక్టర్, నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎటువంటి ఉపయోగం లేకుండా పోయింది. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. బఫర్ జోన్ లోనూ నిర్మాణాలు చేపట్టిన అనురాగ్ విద్యా సంస్థలు, గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు.మరోవైపు హైడ్రా తమ ఆస్తుల విషయంలో పరిధికి మించి జోక్యం చేసుకుంటుందని.. కూల్చివేతలను చేపట్టకూడదని పేర్కొంటూ రాష్ట్రంలోని పలు విద్యాసంస్థలు హైకోర్టును ఆశ్రయించాయి. ఇందులో అనురాగ్ విద్యా సంస్థలు కూడా ఉన్నాయి. భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే పళ్ళ రాజేశ్వర్ రెడ్డి చెందిన అనురాగ్ యూనివర్సిటీ, గాయత్రి ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ట్రస్ట్, నీలిమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వంటి సంస్థలు హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశాయి. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం కురెముల గ్రామంలోని 823/ ఈ, 813/ఈఈ, 813/ఏఏ/2, 813/ ఏ ఏ/ 1796 సర్వే నెంబర్లలో 17.21 ఎకరాల భూమి, ఇతర నిర్మాణాలపై హైడ్రా అధికారులు జోక్యం చేసుకొని.. విచారణ పేరుతో మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని ఆ విద్యాసంస్థలు ఫిర్యాదుల పేర్కొన్నాయి. హైడ్రా నిలువరించకపోతే.. తమ నిర్మాణాలను పడగొట్టే ప్రమాదం ఉందని ఆ విద్యాసంస్థల బాధ్యులు పేర్కొన్నారు. ఇదే సమయంలో విద్యాసంస్థల ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న హైకోర్టు.. నిబంధన ప్రకారం నడుచుకోవాలని సూచించింది. ఈ ప్రకారం ప్రభుత్వ న్యాయవాది హామీ ఇవ్వడంతో కేసు ముగిసింది .మరోవైపు అనురాగ్ విద్యాసంస్థలపై వస్తున్న ఆరోపణలపై ఆ విద్యాసంస్థల చైర్మన్ పల్లా రాజేశ్వరరెడ్డి స్పందించారు. ప్రభుత్వం తమపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తమ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థల్లో ప్రభుత్వం ఈ ఈ సంవత్సరం వివిధ కోర్సుల్లో 480 సీట్లలో కోత విధించింది అన్నారు. తమ కళాశాలకు అనుమతి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుందని వాపోయారు. ఇప్పటికే తమ విద్యాసంస్థలపై విజిలెన్స్, ఇంటలిజెన్స్, రెవెన్యూ, నీటిపారుదల, విద్యాశాఖ అధికారులు నిత్యం సోదాలు నిర్వహిస్తున్నారన్నారు. ఎలాంటి అవకతవకలు చోటు చేసుకున్నట్టు కనిపించకపోవడంతో.. నీటిపారుదల శాఖ అధికారులపై ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి తీసుకొచ్చి తమపై మరో కేసు నమోదు చేశారని ఆయన వివరించారు. ఈ కేసు వల్ల తమ యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆయన వాపోయారు

# పంజాగుట్ట పరిసరాల్లో ఘోర రోడ్డు ప్రమాదం

హైదరాబాద్: హైదరాబాద్‌లోని పంజాగుట్ట పరిసరాల్లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌ను టెంపో ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మణుగూరుకి చెందిన ఎస్పీఎఫ్ ఎస్ఐ శంక్రరావు.. సోమవారం ఉదయం తన కూతుర్ని ఆసుపత్రికి తీసుకెళ్తున్నారు. బేగంపేట నుంచి పంజాగుట్టలోని ఓ ఆసుపత్రికి తీసుకొస్తున్నాడు.లైఫ్ స్టయల్ షాపింగ్ ప్రాంతానికి రాగానే శంకరావు డ్రైవ్ చేస్తున్న బైక్‌ను వెనుక నుంచి వచ్చిన టెంపో బలంగా ఢీ కొట్టింది. స్పాట్‌లో శంక్రరావు కూతురు ప్రసన్న మృతి చెందింది. ఈ ఘటనలో శంకర్రావు తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.ప్రసన్న మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టెంపో వాహనాన్ని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. టెంపో డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# అదృష్టమంటే అక్కడే..

## రైలు కిందపడినా సేఫ్ అయ్యింది
## - ఆమె ఆలోచనకు అందరి హ్యాట్సాఫ్
## - తాండూరులో వైరల్ అయిన సంఘటన

ప్రమాదాలు ఎప్పుడు ఎలా వస్తాయో తెలియదు. అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలలో ఎందరో ప్రాణాలు కోల్పోతారు. కొందరిలో మాత్రమే అదృష్ట వశాత్తు బతికిపోతారు. అనుకోకుండా జరిగే రైలు ప్రమాదాల్లో బతికి బయటపడం అసాధ్యమే. కాని వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం నావంద్గి రైల్వే స్టేషన్ పరిధిలో ఓ గిరిజన మహిళ అదృష్ట వశాత్తు బతికి పోయింది. ఇందుకు సంబంధించిన ఓ వీడియో స్థానికంగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బషీరాబాద్ మండలం నవాంద్గి రైల్వే స్టేషన్ మధ్య ఈ సంఘటన జరిగింది.

రైల్వే స్టేషన్ సమీపంలో టాకీ తాండాకు చెందిన ఓ మహిళ పట్టాలు తాటే ప్రయత్నం చేస్తుండగా వేగంగా వచ్చిన ఓ గూడ్స్ రైలు అటుగా వచ్చింది. వెంటనే రైలు పట్టాల మధ్య పడుకుంది. ఏమాత్రం తలను, శరీరాన్ని పైకిలేపకుండా పట్టాలకు అతుక్కుపోయింది. ఊపిరి భిగబట్టి.. స్థానికుల సూచనలు పాటిస్తూ ధైర్యంగా పడుకుంది. రైలు మీద నుంచి పూర్తిగా వేళ్లేంత వరకు అలాగే పడుకుంది. రైలు వెళ్లిపోయిన తరువాత ప్రాణాలతో సేఫ్‌గా బయటపడింది. ఈ సంఘటనను స్థానికులు వీడియో తీశారు. రైలు ప్రమాదంలో ప్రాణాలనుంచి బయటపడిన మహిళను అదృష్ణమంటే అక్కదే అంటూ ట్రాక్ మధ్య పడుకుని ప్రాణాలు కాపాడుకున్న ధైర్యాన్ని మెచ్చుకున్నారు. అయితే మహిళకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు.

# పూర్వ వైభవం సాధ్యమేనా..?

హైదరాబాద్: తెలంగాణ టీడీపీకి కొత్త జవసత్వాలు కల్పించేందుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఫోకస్ పెట్టారు. ఆయన ఇప్పటికే మూడు సార్లు తెలంగాణ టీడీపీ నాయకులతో భేటీ అయ్యారు. తాజాగా ఆదివారం కూడా మరో మారు ఇక్కడి నాయకులతో సమావేశమై చర్చించారు. తెలంగాణలో శాసనసభ ఎన్నికలకు దూరంగా ఉన్న ఆ పార్టీ, లోక్ సభ ఎన్నికల్లోనూ పోటీ చేయలేదు. ఇప్పుడు ఇక్కడ తమకు అనుకూలమైన నాయకత్వం ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు కావడం, టీటీడీపీని ముప్పుతిప్పలు పెట్టిన బీఆర్ఎస్ ఆత్మరక్షణలో ఉండడం, ఏపీలో తమ మిత్రపక్షంగా ఉన్న బీజేపీ తెలంగాణలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలు, ఎనిమిది లోక్ సభ స్థానాలను గెలుచుకోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని పార్టీకి పునర్ వైభవం తీసుకురావడానికి సరైన సమయమని భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ కారణంగానే చంద్రబాబు నాయుడు ఇప్పటికే మూడు పర్యాయాలు హైదరాబాద్ ఎన్టీఆర్ భవన్ లో సమావేశం అయ్యారు.తెలంగాణలో టీడీపీకి మంచి బేస్ ఉంది. ఇప్పటికీ కార్యకర్తల బలం ఉంది. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటయ్యాక కూడా 2014 ఎన్నికల్లో, ఆ తర్వాత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే సీట్లను గెలుచుకుంది. కానీ, బీఆర్ఎస్ చేసిన ఆపరేషన్ ఆకర్ష్ వల్ల టీటీడీపీకి కుదేలు అయ్యింది. ప్రధానంగా రాష్ట్రంలో ఓటుకు నోటు కేసు తర్వాత టీటీడీపీని వీడిన నాయకులు ఎక్కువయ్యారు. తెలంగాణ టీడీపీ శాసనసభా పక్షాన్ని కూడా అప్పటి టీటీడీపీ పక్ష నేత ఎర్రబెల్లి దయాకర్ రావు బీఆర్ఎస్ లో విలీనం చేశారు. శాసనమండలిలో సైతం ఎమ్మెల్సీలు అంతా టీటీడీపీని వీడి బీఆర్ఎస్ లో చేరిపోయారు. ఏకంగా 10 మంది ఎమ్మెల్యేలు ఒకేసారి పార్టీని వీడారు. అప్పుడు పార్టీ అధ్యక్షుడిగా ఉన్న ఎల్.రమణ ఆ తర్వాత బీఆర్ఎస్ లో చేరిపోయారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న రేవంత్ రెడ్డి ఓటుకు నోటు కేసులో అరెస్టై జైలుకు వెళ్లారు. ఆ తర్వాత రేవంత్ టీడీపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు.పార్టీకి బలమైన నాయకులుగా ఉన్న ఎర్రబెల్లి దయాకర్ రావు, రేవంత్ రెడ్డి, ఎల్.రమణ బయటకు వెళ్లిపోవడంతో పార్టీకి దిక్కులేకుండా పోయింది. కొన్నాళ్లకు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు. కొన్ని కార్యక్రమాలు నిర్వహించినా ఆయన తెలంగాణ టీడీపీని గాడిన పెట్టలేకపోయారు. 2014లో గెలిచిన పదకొండు ఎమ్మెల్యేల్లో పది మంది బీఆర్ఎస్ లో విలీనం కాగా, 2018 గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా గులాబీ కండువాలు కప్పుకున్నారు. దీంతో 2023 ఎన్నికల్లో పోటీ చేసే సాహసాన్ని ఆ పార్టీ చేయలేక పోయింది. ఏపీలో రాజకీయ భవిష్యత్తు, తిరిగి అధికారంలోకి రావడంపై దృష్టి పెట్టిన చంద్రబాబు తెలంగాణ టీడీపీకి పెద్దగా ప్రియారిటీ ఇవ్వలేదు. తెలంగాణలో పోటీ చేయడం లేదని ప్రకటించారు. దీంతో తెలంగాణ టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కూడా పార్టీని వీడి బీఆర్ఎస్ లో చేరిపోయారు. ఆయన లోక్ సభ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఇలా.. పార్టీ నేతలు ఒక్కొక్కరుగా బయటకు వెళ్లిపోవడంతో తెలంగాణలో టీడీపీ దుకాణం బంద్ అయ్యింది.తెలంగాణలో పార్టీకి కొత్త రక్తం ఎక్కించేందుకు జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కసరత్తు మొదలుపెట్టారు. పార్టీలో నాయకులంతా క్యూకట్టి ఇతర పార్టీలోకి వెళ్లిపోయినా, ఇక్కడా ఇంకా కొంత ఓటు బ్యాంకు ఉందని, కార్యకర్తల బలం ఉందన్న బలమైన నమ్మకంతో తెలంగాణలో టీడీపీకి పునర్ వైభవం తెచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దీనికోసం కొత్త ప్రణాళికలు తయారు చేస్తున్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతానికి ఎలా ముందుకు సాగాలనే అంశంపై ఆదివారం ఎన్టీఆర్ భవన్ లో చంద్రబాబు స్థానిక నాయకులతో చర్చించారు. దీనిలో భాగంగానే ప్రస్తుతం ఉన్న తాత్కాలిక కమిటీల రద్దుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సారి పార్టీలో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, టీడీపీ నుంచి వచ్చిన రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతల్లో ఉండడం, తమను ఇబ్బంది పెట్టిన బీఆర్ఎస్ ఆత్మరక్షణలో పడిపోవడం, ఏపీలో అదే మాదిరిగా, కేంద్రంలో భాగస్వామ్య పక్షంగా ఉన్న బీజేపీ తెలంగాణలో కొంత మెరుగైన స్థితిలో ఉండడం వంటి సానుకూల అంశాలను పరిగణలోకి తీసుకుని తెలంగాణలో టీడీపీని తిరిగి పట్టాలు ఎక్కించే పనిలో ఉన్నారు.తెలంగాణకు ఇక ప్రతీ 15 రోజులకొకసారి వస్తానని చంద్రబాబు కార్యకర్తలకు మనోధైర్యం చెబుతున్నారు. కొద్ది నెలల్లోనే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానిక ఎన్నికల వేదికగా తిరిగి అరంగేట్రం చేయడం ద్వారా ఉనికి చాటుకోవాలని టీడీపీ నాయకత్వం భావిస్తోందని చెబుతున్నారు. దాదాపు నామ రూపాల్లేకుండా పోయిన టీడీపీ తిరిగి తెలంగాణలో పుంజుకుంటుందా? ఆ పార్టీకి తిరిగి పునర్ వైభవం వస్తుందా? అన్న అంశం ఆసక్తికరంగా మారాయి.

# నాణ్యతలేని ఆహార పదార్థాలు విక్రయిస్తే చర్యలు

## మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి

కోరుట్ల: నాణ్యతలేని ఆహార పదార్థాలు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోంటామని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి హెచ్చరించారు.. సోమవారం పట్టణంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, పట్టణ ప్రజల ఫిర్యాదుల మేరకు పట్టణంలో మున్సిపల్ అధికారులు పలు రెస్టారెంట్, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు మరియు కుళ్ళిపోయిన ఆహార పదార్థాలను స్వాధీన పరుచుకొని అట్టి కుళ్ళిన ఆహార పదార్థాలను డంపింగ్ యార్డ్ లో గుంత తీసి పూడ్చడం జరిగింది. పరిశుభ్రత పాటించని రెస్టారెంట్ , హోటళ్ల యజమానులకు 32 వేల రూపాయలు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి మాట్లాడుతూ పట్టణంలో రెస్టారెంట్లు నిర్వహించే యజమానులు ప్రస్తుత వర్షాకాలం ని దృష్టిలో ఉంచుకొని అంటూ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతను పాటించాలని, నాణ్యమైన పరిశుభ్రమైన తాజా ఆహారాన్ని మాత్రమే ప్రజలకు విక్రయించాలన్నారు. నాసిరకం, కల్తీన ఆహార పదార్థాల వ్యాపారుల నిర్వాహలకు ఉద్దేశించడం తగదన్నారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలని, లేనిపక్షంలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడంతో పాటు భారీ మొత్తంలో జరిమానాలు విధించి,చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ తనిఖీలో సానిటరీ ఇన్స్పెక్టర్ బాలే అశోక్, మున్సిపల్ సిబ్బంది జగ్గల్ల రమేష్, సానిటర్ జవాన్ లు చిట్యాల గాజం, చిట్యాల రమేష్ , చిట్యాల రాజ్ కుమార్ ఉన్నారు..

# కరీంనగర్ కు కాడ్రా..... పబ్లిక్ డిమాండ్

కరీంనగర్: కంచే చేను మేసినట్లు.. ప్రభుత్వాస్తులను రక్షించే వారే భక్షించారు.. గత పాలనలో కోట్లాది రూపాయల భూములను చెరబట్టారు. పేదలు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది. తిరిగి వారి పైనే పోలీసులు కేసు నమోదు చేసిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీన్ రివర్స్ అయింది.. పేదల భూములు కబ్జా చేసిన పలువురు కటకటాల పాలయ్యారు. అలాగే ప్రభుత్వం భూముల పరిరక్షణకు కాడ్రా ఏర్పాటు చేయాలని డిమాండ్ వినిపిస్తున్నది.

బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో వారు వాడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఎవరైనా అడ్డు చెబితే అంతే సంగతులు. గతంలో ఒక మంత్రిగా వ్యవహరించిన ముఖ్య నేత పేరు చెప్పుకొని అనుచరు సాగించిన అరాచకం అంతా కాదు. కోట్లలో ఉండే ప్రభుత్వ భూములతో పాటు పేదల భూములను కూడా చెరపడ్డారు. ఎదురు తిరిగిన వారిపైనే తమకున్న పలుకుబడిని ఉపయోగించి ఉల్టా కేసులు నమోదు చేయించి జైలు పాలు చేశారు. పదేళ్ల కాలం పాటు వారి హవా కొనసాగింది. పోలీసులు, అధికారులు కూడా కిమ్మనకుండా అడ్డు చెప్పలేకపోయారు. ప్రభుత్వం మారింది.. సీన్ రివర్స్ అయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ భూముల కబ్జాపై ప్రత్యేక దృష్టి సారించారు. హైదరాబాదులో వేల కోట్ల రూపాయల చెరువులు, కుంటలు ఇతర ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. వీటి పరిరక్షణతో పాటు ఇకముందు కూడా కబ్జా కాకుండా ఇతర దేశాలో అధ్యయం చేసిన తర్వాత హైడ్రాను అనే ప్రత్యేక ముఖ్యమంత్రి ఏర్పాటు చేశారు. దానికి సంపూర్ణ అధికారాలు అప్పగించారు. చెరువులు, కుంటలు ఎఫ్టిఎల్, బఫర్ జోన్లలో చేపట్టిన అక్రమాణలపై హైడ్రాధికారులు ఉక్కు పాదం మోపుతున్నారు.బీఆర్ఎస్ హయంలో కరీంనగర్ తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో విపరీతమైన భూకబ్జాలు జరిగాయి. పేదలు సామాన్యులను సైతం నానా ఇబ్బందులకు గురిచేసి వారి భూములను సైతం చెర పెట్టారు.ప్రభుత్వ స్థలాల్లో అక్రమణాలపై ఉక్కు పాదం మోపుతున్న హైదరాబాద్ హైడ్రా లాగా కరీంనగర్ కు ఒక కాడ్రా ఏర్పాటు చేయాలని అంశం ప్రజల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయి. ప్రభుత్వాస్తుల పరిరక్షణ, కబ్జాలకు అడ్డుకట్ట వేసేందుకు ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా అనే ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశారు. చెరువులు, కుంటల్లో ఫుల్ ట్యాంక్ లెవెల్ బఫర్ జోన్లలో చేపట్టిన నిర్మాణాలపై హైడ్రా ఉక్కు పాదం మోపుతున్నది. గత బిఆర్ఎస్ పాలనలో కరీంనగర్తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో విచ్చలవిడిగా భూములు కబ్జాకు గురయ్యాయి. అడ్డు అదుపు లేకుండా వేలకోట్ల రూపాయల భూములు అన్యాక్రాంతమయ్యాయి. గతంలో మంత్రిగా వ్యవహరించిన ముఖ్య నేతతో పాటు ఇతర నేతలు ఇందులో కీలకపాత్ర పోషించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పేదలకు సంబంధించిన ప్లాట్లను సైతం చెరబట్టారు. వారిని ముప్పు తిప్పలు పెట్టారు. పేదలు సిపి అభిషేక్ మహంతికి ఫిర్యాదు చేయడంతో కొందరు నాయకులు, కార్పొరేటర్లపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కరీంనగర్ చరిత్రలో కబ్జాల పర్వం సంచలనం సృష్టించింది. దీంతో పాటు అనేక ఫిర్యాదులు భూకబ్జాలపైనే వస్తున్నాయి.హైదరాబాదులో ఏర్పాటు చేసిన హైడ్రాలాగా కరీంనగర్లో ప్రభుత్వ భూముల పరిరక్షణకు కాడ్రా (కరీంనగర్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఆసెట్ ప్రొడక్షన్ ఏజెన్సీ) ని ఏర్పాటు చేయాలని డిమాండ్ ప్రజల నుంచి వస్తున్నది. హైదరాబాదులో కబ్జాదారులపై పాదం మోపుతున్న హైడ్రాకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నది. కరీంనగర్లో సైతం ఏర్పాటు చేస్తే ఆక్రమణదారులకు చుక్కలు తప్పవనే సమాధానం వినిపిస్తున్నది. ఎల్ఎండి రిజర్వాయర్ సమీపంలో ఎస్సారెస్పీకి సంబంధించిన భూములు కబ్జాకు గురయ్యాయి. అదేవిధంగా భూములకు రెక్కలు రావడంతో కరీంనగర్ తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో చెరువులు, కుంటల్లో ప్రభుత్వ భూములను సైతం గత పాలనలో చెరబట్టారు. పేదల ఇండ్లను సైతం ధ్వంసం చేసిన ఘటనలు కరీంనగర్ లో ఉన్నాయి. పైసా పైసా కూడబెట్టుకొని పేదలు ఇళ్ల స్థలాలు కొనుక్కుంటే వారివి సైతం కబ్జా చేశారు. తిరిగి వారి పైన కేసులు పెట్టి జైలు పాలు చేశారు. వీటి విరుగుడుకు కరీంనగర్లో కాడ్రా ఏర్పాటు చేయాలని, దీంతో అటు ప్రభుత్వ భూములు ఇటు సామాన్యుల భూములకు రక్షణ ఉంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల్లో కొంత ధైర్యం కల్పించిన వారవుతారని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి ఇదే అంశంపై ఆదివారం ఒక ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు. ముఖ్యమంత్రి, మంత్రుల సహకారంతో కరీంనగర్ లో కాడ్రా ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇది మంచి నిర్ణయం ప్రజలు స్వాగతించి తీరాల్సిందే.. ఏది ఏమైనా హైడ్రా కరీంనగర్ లోను ప్రకంపనలు సృష్టించే అవకాశం ఉంది. కాడ్రా ఏర్పడితే మాత్రం అక్రమార్కులా వెన్నులో వణుకు పుట్టే అవకాశం ఉంది. చూద్దాం మరి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో కొద్దిరోజులు వెయిట్ చేయాలి మరి..

# త్వరలో అందుబాటులోకి టేకుమట్ల

## - రాఘవరెడ్డిపేట వంతెన

జయశంకర్ భూపాలపల్లి: త్వరలోనే టేకుమట్ల - రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య చలివాగుపై నిర్మిస్తున్న హైలెవల్ వంతెన నిర్మాణ పనులను పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి రానున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి ఎమ్మెల్యే తొంభై శాతం నిర్మాణ పనులను పూర్తి చేసుకున్న వంతెన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. 2023 జులై నెలలో కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గంలోని టేకుమట్ల - రాఘవ రెడ్డిపేట గ్రామాల మధ్య చలివాగుపై ఉన్న వంతెన పిల్లర్లు కూలిన విషయం తెలిసిందే. అట్టి బ్రిడ్జి పిల్లర్ల నిర్మాణ పనులను రూ.4.70 కోట్లతో చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తక్కువ సమయం లోనే వంతెన నిర్మాణంను పూర్తి చేసి, వాగవతలి తొమ్మిది గ్రామాలకు రాకపోకల సౌలభ్యం చేస్తున్న సదరు గుత్తేదారుకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట టేకుమట్ల మండల పార్టీ అధ్యక్షుడితో పాటు పలువురు మండల కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

# సిద్ధిపేటలో రోడ్డు ప్రమాదాల నివారణ గురించి.. వాహనాల తనిఖీ

## పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ

సిద్దిపేట: ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించకుండా నెంబర్ ప్లేట్ లేని తదితర ట్రాఫిక్ వైలేషన్ పై 350 వాహనాలపై కేసులు నమోదు చేసామని పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ వెల్లడించారు,. జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 62 నమోదు చేసాం. నుమానాస్పదంగా ఉన్న వ్యక్తులపై ఫింగర్ ప్రింట్ డ్రైవ్ ద్వారా 225 వ్యక్తులను తనిఖీ చేసాం. గజ్వేల్, సిద్దిపేట, హుస్నాబాద్ పట్టణాలలో ఉన్న లాడ్జిలను తనిఖీ చేసామని అన్నారు, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మరియు డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలు అక్రమ రవాణా నివారించడం గురించి తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. తరచుగా సర్ప్రైజ్ వాహనాల తనిఖీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలకు నెంబర్ ప్లేట్ తప్పకుండా వేయించుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు సిబ్బంది తరచుగా లాడ్జిలలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు లక్ష్మీ బాబు, విద్యాసాగర్, ఉపేందర్, శ్రీను, సైదా, లతీఫ్, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, మరియు సంబంధిత ఎస్ఐలు, పోలీస్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాలు పేదవాడికే దక్కాలి

## బడాబాబులకు రిజిస్ట్రేషన్ చేస్తే సహించేది లేదు

## అధికారులను తలెత్తుకునేలా చేస్తా

## రెవెన్యూ, గృహనిర్మా ణం, శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్: ప్రభుత్వ స్థలాలు పేదవాడికే దక్కాలని, బడాబాబులకు రిజిస్ట్రేషన్ చేస్తే సహించేది లేదని, తప్పు చేసిన అధికారులపై చర్యలు ఉంటాయని రెవెన్యూ, గృహనిర్మా ణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఎంసిఆర్‌హెచ్‌ఆర్డీ లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులతో సమావేశమైన ఆయ న శాఖ పనితీరుపై సమీక్ష జరిపారు. దీంతోపాటు అధికారులతో ముఖాముఖీని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించేందు కు ఉద్యోగులు నిజాయితీ, అంకితభావంతో పని చేయాలని మం త్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కోరారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్ర జలకు ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా సేవలు అందించాలని ఆయన సూచించారు. అలాగే సబ్ రిజిస్ట్రా ర్ కార్యాలయాల అద్దెలు, విద్యుత్ ఛార్జీలు, అద్దె వాహనాల ఛా ర్జీలు తదితర మొదలైన వాటికి అవసరమైన బడ్జెట్ అవసరాలను త్వరలో క్లియర్ చేస్తామని ఆయన ఉద్యోగులకు హామీ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ శాఖకు శాశ్వత ప్రభుత్వ భవనాల ఆవశ్యకతను మం త్రి ప్రస్తావిస్తూ,త్రిముఖ వ్యూహాన్ని రూపొందిస్తున్నామని, దీని కింద అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాలు రెండేళ్లలో ప్రభుత్వ భవనాల్లో పనిచేయడం ప్రారంభిస్తాయని మంత్రి చెప్పారు. ఇతర రాష్ట్రాల్లోని రిజిస్ట్రేషన్ శాఖల్లో ఉన్న మంచి విధానాలను మన రాష్ట్రంలో కూడా పాటించేలా అధ్యయనం చేయాలని అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా సేవలను అందించేందుకు వీలుగా కొత్త టెక్నాలజీలను అవలంభించాల్సిన అవసరాన్ని ఆయన తెలియచేశారు. ప్రభుత్వ కార్యదర్శి, స్టాంపులు రిజిస్ట్రేషన్ల కమిషనర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి రిజిస్ట్రేషన్ శాఖ పనితీరు గురించి సంక్షిప్త వివరణ ఇచ్చారు. 2014లో రూ.2,746 కోట్లుగా ఉన్న రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గతేడాది 14,588 కోట్లకు చేరుకుందని, మంత్రి మార్గదర్శకత్వంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బదిలీలు సజావుగా పూర్తయ్యాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ వార్షిక నివేదికను మంత్రి విడుదల చేశారు.

అధికారులను తలెత్తుకునేలా చేస్తా కొందరు అధికారుల పనితీరు బాగాలేదని, అధికారుల పనితీరు మార్చుకోకపోతే ఎంతటి వారిపై అయినా చర్యలు తీసుకోక తప్పదన్నారు. అధికారులు మానవత్వంతో పనిచేయాలని, రెవెన్యూ వ్యవస్థకు మంచి పేరు తీసుకొచ్చేలా పని చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. తనకు ఎవరి మీద కోపం లేదని, ప్రభుత్వ పరిధిలోని అన్ని శాఖలను నిరంతరం పర్యవేక్షిస్తుంటానని, అధికారులను తలెత్తుకునేలా చేస్తానని మంత్రి పొంగులేటి చెప్పారు. ఇక అధికారుల పదోన్నతులు, బదిలీల విషయంలో ఎవరి ప్రమేయం అవసరం లేదని,రాజకీయ నాయకుల పైరవీలతో వచ్చినా వృథా ప్రయాసే అవుతుందని మంత్రి పొంగులేటి తెలిపారు. అన్నీ తానే చూసుకుంటానని, ఎవరైతే శాఖకు మంచి పేరు తీసుకొస్తారో వారిని గుర్తిస్తానని అధికారులకు మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇప్పటికే తమిళనాడులోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో అవలంభిస్తున్న విధానాలను అధికారులు అధ్యయనం చేశారని, త్వరలో కర్ణాటక, మహారాష్ట్రల్లోనూ అధికారులు అధ్యయనం చేసి నివేదిక ప్రభుత్వానికి ఇవ్వాలని మంత్రి ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఐజిలు, డిఐజిలు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# లండన్ పురుషుల స్పెర్మ్ బిజినెస్...

లండన్: ఈమధ్య కాలంలో పురుషుల వీర్య కణాలతో ప్రపంచవ్యాప్తంగా పెద్ద వ్యాపారమే జరుగుతుంది. ఈ విషయం అనేక మందికి తెలియదు. ఉద్యోగాలు, వ్యాపారాలు చేసి డబ్బులు సంపాదించే వారికంటే వీర్యకణాలను అమ్ముకుంటూ డబ్బులు సంపాదించేవారి సంఖ్య రోజురోజుకి పెరిగిపోతూ ఉంది. ముఖ్యం గా లండన్ దేశం నుండి ఇతర దేశాలకు ఎక్కువ శాతం వీర్య కణాల ఎగుమతి జరుగుతుంది. ఎందుకని లండన్ పురుషుల వీర్య కణాలకు ఈ స్థాయి డిమాండ్ ఉంది?, అక్కడ పురుషుల వీర్యంలో ఏమైనా ప్రత్యేకత ఉందా?, లేకపోతేఇతర దేశాలలో ప్రతీ ఏడాది పురుషుల సంఖ్య తగ్గిపోతూ ఉందా?, అసలు ఏమి జరుగుతుంది అనేది ఇప్పుడు మనం చూద్దాం. లండన్ లో ఉండే పురుషులు కూడా వీర్య కణాలు దానం చెయ్యొచ్చు. కానీ అక్కడ ఒక నిబంధన ఉంది. లండన్ లో ఉండే వీర్య దాతల నుండి ఆసుపత్రులు కేవలం 10 కుటుంబాలకు మాత్రమే వీర్యం దానం చేసేందుకు అనుమతిని ఇచ్చింది. కానీ లండన్ నుండి ఇతర దేశాలకు వీర్య కణాలను ఎగుమతి చేయడంపై ఎలాంటి నిషేధం లేదు. అందుకే లండన్ పురుషుల స్పెర్మ్ (వీర్యకణాలు) పై రోజు రోజుకి డిమాండ్ పెరుగుతుంది. లండన్ లో ఉండే మహిళలు ఈమధ్య స్వలింగ సంపర్కులు గర్భం దాల్చడంలో ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల సంతానోత్పత్తి చికిత్సలకు భారీగా డిమాండ్ పెరగడంతో వీర్యదాతలకు కూడా డిమాండ్ పెరిగింది. ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఎంఈ) మరియు అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీస్ (ంఖీ) వాడకం పెరగడంతో ఆడవాళ్లు స్పెర్మ్ బ్యాంకులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈమధ్యకాలం లో అనేక మంది పెళ్లి కి దూరంగా ఉంటూ, వృత్తిపరంగా ఉన్నత స్థానాలను అధిరోహించడానికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. ఆ తర్వాత కొన్నాళ్ళకు వారికి ఒక కుటుంబం ఉంటే బాగుంటుంది అనిపిస్తుంది. ఆ సమయంలో వారికి వయస్సు రీత్యా గర్భం దాల్చే సామర్థ్యం తగ్గిపోతుంది కాబట్టి స్పెర్మ్ బ్యాంకుల సహాయంపై ఆధార పడుతుంటారు.

ఒంటరి మహిళలు, లెస్బియన్ జంటలు ఎక్కువగా ఈ సేవల కోసం మొగ్గు చూపుతుంటారు. ఇది ఇలా ఉండగా స్పెర్మ్ డొనేషన్ ను మహిళలకు మరింత చేరువ చేసేందుకు స్పెర్మ్ బ్యాంకులు తమ సేవలను మరింత విస్తరింపజేశాయి. వీర్య దానం పొందిన వారు పెద్ద ఎత్తున డబ్బులు కూడా చెల్లిస్తున్నారు. దీంతో లండన్ లో నివసించే పురుషులు చాలా మంది దీనిని ఒక వృత్తిగా తీసుకున్నారు. అయితే ఈ వీర్య దానం పై భారతదేశం లో ఉండే పురుషులకు సరైన అవగాహన లేదు. లండన్ స్థాయిలో ఇక్కడ వీర్య కణాలతో వ్యాపారం చేసేవారి సంఖ్య చాలా తక్కువ. అసలు ఇలాంటివి కూడా జరుగుతాయా అని కొంతమంది ఆశ్చర్యపోతూ అడుగుతుంటారు. అలా దీని గురించి ఏమాత్రం అవగాహన లేని వారు, తెలుగులో గత ఏడాది విడుదలైన 'మిస్ శెట్టి..మిస్టర్ పోలిశెట్టి' చిత్రాన్ని చూడండి. ఇందులో నవీన్ పోలిశెట్టి, అనుష్క శెట్టి హీరోహీరోయిన్లు గా నటించారు.

# హైడ్రానా..మజాకా...?

## 18 ప్రాంతాల్లోని కబ్జాల నుంచి 43.94 ఎకరాల ప్రభుత్వ స్థలాలు స్వాధీనం

హైదరాబాద్;హైడ్రా తీసుకున్న చర్యలు, కాపాడిన భూముల వివరాలతో కూడిన నివేదిక ప్రభుత్వానికి చేరింది. గత రెండు నెలల నుంచి చెరువుల్లో, పార్కుల్లో, ప్రభుత్వ భూముల్లో చేపట్టిన కూల్చివేతలు, కాపాడిన భూముల వివరాలను ఆ నివేదికలో వివరించారు. ఆదివారంప్రభుత్వానికి హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ తన నివేదికను అందజేశారు. ఓఆర్ఆర్ పరిధిలోని 8 మునిసిపల్ కార్పొరేషన్‌లు, 20 మునిసిపాలిటీలు, 33 పంచాయతీల పరిధిలో వచ్చిన ఫిర్యాదుల మేరకు 18 చోట్ల కూల్చివేతలు జరిపినట్లు కమిషనర్ వెల్లడించారు. జూన్ 27 నుంచి ఈనెల 24 వరకు చేపట్టిన కూల్చివేతలకు సంబంధించిన వివరాలను నివేదికలో పొందుపరిచారు. కూల్చివేతలు చేపట్టిన 18 ప్రాంతాల్లోని కబ్జాల నుంచి 43.94 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఆ నివేదికలో తెలిపారు. అందరూ ప్రముఖులే, ఆక్రమ నిర్మాణాలే.. హైడ్రా తీసుకున్న చర్యల్లో ముఖ్యంగా చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లతో పాటు పార్కు స్థలాలను కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలు ఉన్నాయని, ఇందులో పలువురు రాజకీయ నేతలు, సినీనటులు, క్రీడాకారులు కూడా ఉన్నట్టు హైడ్రా నివేదికలో పేర్కొన్నారు. ఎన్‌ఓసిలు లేవు. అనుమతులు అంతకన్నా లేవు. కోర్టు కేసులు, క్రమబద్ధీకరణ లేకుండానే చెరువులను ఆక్రమించుకోవడం, నిర్మాణాలను చేపట్టడం ఈ చర్యలతో బహిర్గతమైనట్టు తెలిపినట్టు సమాచారం. వచ్చిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని, సమగ్రంగా విచారణ చేపట్టిన అనంతరం చర్యలు తీసుకున్నట్టు ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన సందర్భంలో తెలియజేసినట్టు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. కొందరు కేసులని, అనుమతులు ఉన్నాయని, ఎన్‌ఓసిలు తీసుకున్నామని చెబుతూ వ్యవస్థలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నట్టు రంగనాథ్ తెలిపారనేది సమాచారం.

కూల్చివేతలు, కాపాడిన భూములు..

చింతల్ చెరువులో బిఆర్ఎస్ పార్టీకి చెందిన స్థానిక నాయకుడు రత్నాకరం సాయిరాజు అక్రమంగా నిర్మించిన 54 నిర్మాణాలను నేలమట్టం చేసి 3 ఎకరాల 5 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు ఆ నివేదికలో పొందుపరిచారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నందగిరిహిల్స్ పార్కు స్థలంలో ఎంఎల్ఏ నాగేందర్ మద్దతుదారుడు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించి 18 గుంటల భూమిని కాపాడినట్టు వెల్లడించారు. ఎంఐఎం పార్టీకి చెందిన బహదూర్‌పురా ఎంఎల్ఏ మహ్మద్ ముబిన్, ఎంఎల్‌సి మిరాజ్ రెహ్మత్ బేగ్‌కు చెందిన రాజేంద్రనగర్ పరిధిలోని శివరాంపల్లి బూమ్‌రుఖ్ ఉద్ దౌలా చెరువులో అక్రమంగా నిర్మించిన ఐదంతస్థుల రెండు భవనాలను, ఒకటి రెండంతస్థుల భవనంతో పాటు మరో భవనాన్ని నేలమట్టం చేసినట్టు రంగనాథ్ తన నివేదికలో వివరించారు. ఈ చెరువు పరిధిలో మొత్తం 46 అక్రమ కట్టడాలను తొలగించడం ద్వారా 12 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనంలోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. గండిపేట్ జలాశయం ఎఫ్‌టిఎల్ పరిధిలోని చిలుకూరు, ఖానాపూర్‌లలో కాంగ్రెస్‌కు చెందిన కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు సోదరుడు పల్లం ఆనంద్, కావేరి సీడ్స్ యజమాని జివి భాస్కర్‌రావు, మంథని అసెంబ్లీ ఎంఎల్‌ఏగా పోటీ చేసిన సునీల్ రెడ్డి, ప్రో కబడ్డీ యజమాని అనుపమ అధికారికంగా అనుమతులు తీసుకోకుండా నిర్మించిన 8 భవనాలు, 14 తాత్కాలిక షెడ్లు, 4 ప్రహరీలను కూల్చివేసినట్టు తెలిపారు. ఈ చర్యలతో ఖానాపూర్, చిల్కూరు ప్రాంతంలో గండిపేట్ జలాశయం ఎఫ్‌టిఎల్ పరిధిలోని 16 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు హైడ్రా నివేదికలో వివరించారు. మాదాపూర్ తమ్మిడికుంట చెరువులో అనుమతులు లేకుండా ఎఫ్‌టిఎల్ పరిధిలో సినీనటుడు నాగార్జున అక్రమంగా నిర్మించిన ఎన్‌కన్వెన్షన్‌లో రెండు నిర్మాణాలను కూల్చివేసి 4 ఎకరాల 9 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఫిల్మ్‌నగర్ హౌసింగ్ సొసైటీకి చెందిన ప్రదేశంలోని పార్కు స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని తొలగించి 16 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

# ఎల్ ఆర్ ఎస్ కు ఫీజా...?

హైదరాబాద్: కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఎల్ఆర్ఎస్ (భూముల క్రమబద్ధీకరణ) పథకాన్ని పూర్తి ఉచితంగా అమలు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఒకవైపు రుణమాఫీ కాక, రైతు బంధు రాక రైతన్నలు ఆవేదన చెందుతుంటే, మరోవైపు విషజ్వరాలతో సామాన్య ప్రజలు ఆసుపత్రుల పాలై, ఖర్చులు భరించలేక అల్లాడుతుంటే.. ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన మీ ప్రభుత్వం, ఎల్ఆర్ఎస్ ఫీజులు వసూలు చేయాలని కలెక్టర్ స్థాయి నుంచి పంచాయతీ సెక్రెటరీ వరకు ఉన్న యంత్రాంగం మీద తీవ్ర ఒత్తిడి చేస్తుందని విమర్శించారు. పంచాయతీ సెక్రెటరీలు, బిల్ కలెక్టర్లు రోజుకు మూడు నాలుగు సార్లు ఫోన్లు చేస్తూ ప్రజలను వేధిస్తున్నారని గుర్తు చేశారు. ఫీజులు చెల్లించకుంటే లేఅవుట్లు రద్దు చేస్తామంటూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నారని అన్నారు. ఈ మేరకు హరీశ్ రావు సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. డిమాండ్ నోటీసులు ఇస్తూ టార్గెట్లు పెట్టి మరీ మొత్తం రూ.15 వేల కోట్లు వసూళ్లు చేయాలని ఆదేశాలివ్వడమంటే ప్రజల రక్తమాంసాలను పీల్చడమే. మీ ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎల్ఆర్ఎస్ అంటే దోపిడీ అన్న మీరు.. ఈ రోజు ప్రజలనెందుకు దోపిడీ చేస్తున్నారో సమాధానం చెప్పాలి. నాడు ఫ్రీఫ్రీఫ్రీ అని, నేడు ఫీజు ఫీజు ఫీజు అంటున్నారు. ప్రజలు దాచుకున్న సొమ్మును నిలువునా దోచుకునే కుట్ర చేస్తున్నారు. ఓడ దాటే దాక ఓడ మల్లన్న, ఓడ దాటినంక బోడి మల్లన్న చందంగా ఉన్నమీ వైఖరి మరోసారి తేటతెల్లమవుతున్నది. అపుడు ఎల్ ఆర్ ఎస్ కు ఫీజు వద్దన్న మీరు ఇప్పుడు అధికారం లోకి రాగానే అదే ఎల్ ఆర్ ఎస్ తో దందా చేస్తున్నారా? అప్పుడు కట్టొద్దని ఇప్పుడు కాటు వేస్తారా? స్వయంగా మీతో సహా ప్రస్తుతం మీ కేబినెట్‌లో సహచరులుగా ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వంటి నేతల మాటలను మీకు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను.

1, ఉత్తమ్ కుమార్ రెడ్డి: నో ఎల్ఆర్ఎస్– నో బీఆర్ఎస్, మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్క రూపాయి తీసుకోకుండా ఉచితంగా ఎల్ఆర్ఎస్‌ను అమలు చేస్తాం.

2, భట్టి విక్రమార్క: రక్తాన్ని పీల్చాలన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. వీలైతే కట్టమాకండి. అప్పుల భారాన్ని ఎల్ఆర్ఎస్ రూపంలో ప్రజల మీద వేస్తున్నారు.

3, సీతక్క: ఎల్ఆర్ఎస్ పేరుతో దోచుకోవడానికి, దాచుకోవడానికి ప్రజల దగ్గర చిల్లిగవ్వ లేకుండా చేయడానికి కొత్త నాటకం.

4, రేవంత్ రెడ్డి: బిఆర్ఎస్ అయిపోయింది. ఎల్ఆర్ఎస్ అయిపోయింది. ఎంఆర్ఎస్ తెస్తడట. ఎంఆర్ఎస్ అంటే మ్యారేజ్ రెగ్యులరైజేషన్ స్కీం కూడా తీసుకొస్తుందేమో.

ఇవి మాత్రమే కాదు, ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలి అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఏకంగా హైకోర్టుకు వెళ్లారు. పిల్ దాఖలు చేసారు. ఎన్నికల్లో గెలిచేందుకు ప్రజలను మభ్య పెట్టి రెచ్చగొట్టేలా బహిరంగ సభల్లో ఊదరగొట్టిన మీరు, మీ మంత్రులు.. ఎన్నికలు పూర్తికాగానే మాట మార్చి ఎల్ఆర్ఎస్ పైన ఫీజులు వసూలు చేయాలని నిర్ణయం తీసుకోవడం మీ రెండు నాల్కల ధోరణికి అద్దం పడుతున్నది. రాష్ట్రంలో ఉన్న పేద మధ్యతరగతి ప్రజల పైన రూ.15వేల కోట్ల మేర ఎల్ఆర్ఎస్ చార్జీల భారం వేయడం పరిపాలనలో, హామీల అమలులో మీ డొల్లతనానికి నిదర్శనంగా నిలుస్తున్నది. మాది ప్రజాపాలన అని డబ్బాకొట్టుకుంటున్న మీకు 25.44 లక్షల దరఖాస్తుదారుల కుటుంబాల ఆవేదన కనిపించడం లేదా?

ఇప్పటికైనా కళ్లు తెరిచి మీరు ఇచ్చిన హామీ ప్రకారం, పూర్తి ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. మాట తప్పిన ప్రభుత్వానికి చెంపపెట్టుగా ఏ ఒక్కరూ ఒక్క రూపాయి ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించవద్దని రాష్ట్ర ప్రజలకు పిలుపునిస్తున్నాము. కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి ఎల్ఆర్ఎస్ ను ఉచితంగా అమలు చేయించే బాధ్యత బిఆర్ఎస్ తీసుకుంటుందని స్పష్టం చేస్తున్నాం" అని హరీశ్ రావు అన్నారు.

# ప్రైవేటు వైద్యులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి.

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి: ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు ప్రభుత్వ విధివిధానాలు పాటించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమ వారం ఐడిఓసి కార్యాలయపు కాన్ఫరెన్స్ హాలులో ప్రైవేట్ ఆసుపత్రులు పాటించాల్సిన నియమ నిబంధనలు గురించి జిల్లా లోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు, వైద్యశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు ప్రభుత్వ నిబంధనలను అనుసరించి వైద్య సేవలు అందించాలని అన్నారు. ఆసుపత్రికి సంబంధించిన వివరాలు తెలుగు, ఇంగ్లీష్ భాషలలో వైద్య సేవలకు వసూలు చేయు ధరల పట్టిక, వైద్య సిబ్బంది వివరాలు, టెస్టుల వివరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.. ఐ.ఈ.సి ద్వారా అందించే పోస్టర్ ను ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేయాలని అన్నారు. లింగననిర్ధారణ పరీక్షలు చేయడం చట్టవ్యతిరేకమని, చేయకూడదని స్పష్టం చేసారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సంబంధిం చిన వివరాలు కేసు షీట్ లో నమోదు చేయాలన్నారు. ప్రసూతి, చిన్నారుల వైద్య సేవల వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయాలని అన్నారు. సీజనల్ వ్యాధులు గురించి ప్రస్తావిస్తూ డెంగీ, మలేరియా, టిబి వ్యాధి గ్రస్తుల రికార్డులను నమోదు చేసి నివేదిక ప్రభుత్వానికి అందించాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు సేవా దృక్పథంతో పని చేయాలని సూచించారు.

డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి విష జ్వరాల నిర్ధారణ పరీక్షలు కేవలం రక్తపరీక్షలు, ర్యాపిడ్ టెస్ట్ ద్వారా కాకుండా జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన టీ హబ్ లో ఎలిశా టెస్ట్ ద్వారా నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేయాలని తెలిపారు. ప్రభుత్వం డెంగీ కేసులల్లో తప్పుడు నివేదికలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేయొద్దని కచ్చితంగా డెంగీ నిర్ధారణ జరిగితే స్థానిక పంచాయితీ, మున్సిపల్, వైద్యాధికారులకు సమాచారం అందించాలని అన్నారు. వ్యాధి నిర్ధారణ ఆధారంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణ, కమ్యూనిటీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వ్యాధి వ్యాప్తి జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక తనిఖీ అధికారులు ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేస్తారని, తనిఖీలో నిబంధనలు ఉల్లంఘన జరిచినట్లు నిర్ధారణ జరిగితే ఆసుపత్రులను సీజ్ చేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ వైద్యులు ప్రయివేటు ఆసుపత్రులను తనిఖీ చేయాలని ఆదేశించారు. తనిఖీలో వైద్య సేవల ధరల పట్టిక, చికిత్స పొందిన వ్యక్తుల కేసు షీట్ లను పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో విషజ్వరాలు... ఒక్క రోజే ఆరుగురు మృతి

హైదరాబాద్: తెలంగాణలో వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్స్, డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. వైరల్ ఫీవర్స్‌తో ఒకే రోజు ఆరుగురు ప్రాణాలు కోల్పో వడం ఆందోళన కలిగిస్తోంది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గంగాదేవిపాడు గ్రామంలో ఈడుపుగంటి సామ్రాజ్యం (67) అనే మహిళకు వారం కింద జ్వరం రావడంతో ఆస్పత్రిలో చేరారు. అక్కడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. అటు, ఇదే మండలం బ్రహ్మళకుంటకు చెందిన బానోతు కృష్ణ (50)కు వారం కింద ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో కల్లూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. రెండు రోజుల కిందటే ఇంటికి వచ్చి పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. అలాగే, కామారెడ్డి – సదాశివనగర్ మండలం లోని భూంపల్లికి చెందిన మనస్విని (11)కి జ్వరం రాగా కుటుంబ సభ్యులు కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ తీసుకొస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయింది. అటు, ఇదే కామారెడ్డి – సదాశివనగర్‌లో నరేశ్ (29) అనే వ్యక్తి డెంగీతో మృతి చెందాడు. అలాగే, కరీంనగర్ – ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన నేరెళ్ల ప్రశాంత్ (26) జ్వరంతో ప్రాణాలు కోల్పోయాడు. ఇతను స్థానికంగా చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నాడు. ఈ క్రమంలోనే తీవ్ర అస్వస్థతకు గురి కాగా కరీంనగర్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే చనిపోయాడు. మరోవైపు, మహబూబాబాద్ – కొత్తగూడ మండలం హనుమాన్ తండాలో రాజేందర్, సంధ్య దంపతులు హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ దంపతులు కుమార్తెకు 5 రోజుల కిందటే జ్వరం వచ్చి తగ్గింది. స్వగ్రామంలో పని ఉందని కూతురితో కలిసి వెళ్తుండగా.. దారిలో జ్వరం ఎక్కువై ఫిట్స్ వచ్చింది. ఈ క్రమం లోనే ఆమెను నర్సంపేటకు తీసుకెళు తుండగా మార్గమధ్యలోనే చనిపోయి నట్లు తల్లిదండ్రులు తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వైరల్ ఫీవర్స్, డెంగీ జ్వరాలతో రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఇదే అదనుగా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ప్రతి జ్వరాన్ని డెంగీ అని చెప్పి చికిత్స కోసం భారీగా వసూలు చేస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. 'డెంగీ ఉదయం పూట కుట్టే ఏడిస్ దోమల ద్వారా వ్యాపించే ఓ సాధారణ జ్వరం. ఇది కార్పో వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుంది. తీవ్ర జ్వరం, తలనొప్పి, కంటి లోపలి భాగం నొప్పి, వాంతులు, విరేచనాలు, కండరాలు, కీళ్లనొప్పులు, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు కన్పిస్తాయి. టీ – 1, టీ – 2, టీ – 3 లక్షణాలతో ప్లేట్ లెట్స్ సంఖ్య తగ్గుతుంది. అవి 20 వేలకు తగ్గినా ఇబ్బంది ఉండదు. తిరిగి అవే వృద్ధి చెందుతాయి. ప్రస్తుత సీజన్‌లో జ్వరాలతో ఎక్కువమంది ఆస్పత్రులకు వస్తున్నారు. మరి కొందరు నిర్లక్ష్యంతో సొంత వైద్యం చేసుకుంటున్నారు.

అలా కాకుండా లక్షణాలు కన్పించిన వెంటనే వైద్యున్ని సంప్రదిస్తే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.' అని వైద్యాధికారులూ సూచించారు. మరోవైపు, రాష్ట్రంలో డెంగీ, విష జ్వరాల విజృంభణపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. 'రాష్ట్రంలో డెంగీ మరణాలు లేవని ప్రభుత్వం చెబుతోంది. కానీ ఒక్కరోజు లో 5 మంది డెంగీతో చనిపోయినట్లు వార్తాకథనాలు పేర్కొంటున్నాయి. ఈ డేటాను ఎవరు ఎందుకు దాచిపెడుతున్నారు.?' అని ట్విట్టర్ వేదికగా కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా మందులు లేవని.. చాలా ఆస్పత్రుల్లో ఒక్కో బెడ్‌పై ముగ్గురు, నలుగురు ఉండి ట్రీట్మెంట్ తీసుకుంటున్నారని అన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రేమ విఫలమై ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

సికింద్రాబాద్:ప్రేమ విఫలమై ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఉత్తరప్రదేశ్ కు చెందిన పవన్ కుమార్ (34) ఈస్ట్ ఆనంద్ బాగ్ లోని ఆర్పీఎఫ్ బెటాలియన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల 23వ తారీకు ఉదయం పిటి కి హాజరు కాకపోవడంతో అతనికోసం బెటాలియంలో వెతకడం మొదలుపెట్టారు, మధ్యాహ్నం అయ్యే సరికి బెటాలియన్ లోని అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్లో కేబులు వైర్లతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతుడు పవన్ కుమార్ తన గ్రామానికి చెందిన యువతీతో ప్రేమ విఫలమవడంతో ఆత్మహత్య చేసుకున్నట్లుగా తన జేబులో ఉన్న లేఖలో పేర్కొన్నాడు , సంబంధిత విషయంపై ఆర్పీఎఫ్ ఇన్స్పెక్టర్ మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి మల్కాజిగిరి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు

# నమ్మశక్యం కాని నిజాలతో సంజయ్

కోల్ కత్తా : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్ కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ జైల్లో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సంగతి తెలిసిందే. అయితే విచారణలో భాగంగా అతడికి ఇటీవల పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించారు. ఇదే జైల్లో లై డిటెక్టర్ పరీక్ష చేయగా.. అన్నీ పొంతనలేని సమాధానం చెప్పినట్లు సమాచారం తాను ఫెసిలిటీ సెమినార్ హాల్‌కు చేరుకున్నప్పుడు బాధితురాలు అప్పటికే మృతి చెంది ఉందని, భయంతో అక్కడి నుంచి పారిపోయానని లై డిటెక్టర్ పరీక్షలో పేర్కొన్నాడు. అంతేకాక అత్యాచారం, హత్య కేసులో తాను నిర్దోషినని పాలిగ్రాఫ్ టెస్ట్‌లో చెప్పడం ఆశ్చర్యానికి గురి చేసింది. లై డిటెక్టర్ పరీక్షలో ఇదే విధంగా తప్పుడు, నమ్మశక్యం కాని సమాధానాలను అనేకం చెప్పాడు. ఈ పరీక్ష చేసేటప్పుడు సంజయ్ రాయ్ నిరుత్సాహంగా, ఆందోళనగా కనిపించాడని, కావాలనే కొందరు తనను ఈ కేసులో ఇరికించారని చెప్పుకొచ్చాడు. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. మరోవైపు కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో ఆగస్టు 9న వెలుగు చూసిన వైద్యురాలి హత్యాచార కేసులో.. ఆ మరుసటి రోజే కోల్‌కతా పోలీసులు సంజయ్ రాయ్‌ను అరెస్ట్ చేశారు. అప్పుడు అత్యాచారం ,హత్య చేసినట్లు సంజయ్ రాయ్ నేరం అంగీకరించాడు. ఘటన సమయంలో ప్రతీ నిమిషం చోటుచేసుకున్న పరిణామాలను పూసగుచ్చినట్లు వివరించాడని, అతడిలో పశ్చాత్తాపమే కన్పించలేదని కేసు దర్యాప్తులో పాల్గొన్న సీబీఐ అధికారులు చెప్పారు. అయితే తాజాగా తనను ఇరికించారని, నిర్దోషినని కన్నీటి పర్యాంతం అవడం పలు అనుమానాలకు తావిస్తుంది. పైగా గత వారం సీల్దాలోని అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు కూడా ఇవే మాటలు చెప్పాడు. అంతేకాకుండా తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి లై డిటెక్ట్ పరీక్షకు కూడా సమ్మతిస్తున్నట్లు చెప్పాడు. ప్రస్తుతం కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ.. కోర్టు ఆదేశాలతో నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్ష సమయంలో సంజయ్ పరిశోధకులను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తున్నాడని, నేరం జరిగినప్పుడు ఆస్పత్రిలో ఉన్న అతని ముఖానికి గాయాలు ఎలా తగిలాయో చెప్పమని అడిగినప్పుడు మాత్రం ఎలాంటి వివరణ ఇవ్వలేనని ఓ అధికారి తెలిపారు. అందుకే అధికారులు అడిగిన ప్రశ్నలకు అవాస్తవాలు, సరిపోలని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. ఆసుపత్రిలోని సెమినార్ హాల్‌లో మహిళ శవమై కనిపించిన వైద్యురాలి పోస్టుమార్టం రిపోర్టులో లైంగిక వేధింపులు, ఆమె శరీరంపై ప్రైవేట్ భాగాలతో సహా 25 గాయాలు ఉన్నట్లు వెల్లడైంది. ఆగస్ట్ 9 తెల్లవారుజామున 4.03 గంటలకు సంజయ్ రాయ్ సెమినార్ హాల్‌లోకి వెళ్లడాన్ని పోలీసులు సీసీటీవీ కెమెరాల్లో చూశారు. నేరస్థలంలో అతని బ్లూటూత్ హెడ్‌సెట్‌ను కూడా కనుగొన్నారు. ఇక సంజయ్ రాయ్ మానసిక విశ్లేషణ ప్రొఫైలింగ్ పరీక్షించగా.. అతడు పోర్నోగ్రఫీకి విపరీతంగా బానిసైనట్లు వెల్లడించింది. అతడిలో జంతు ప్రవృత్తి ఉన్నట్లు గుర్తించారు.

# హైడ్రాపై సొంత పార్టీలోనే వ్యతిరేకత

హైదరాబాద్: తెలంగాణలో రాజకీయం అంతా ఇప్పుడు హైడ్రా కూల్చివేల చుట్టూ తిరుగుతోంది. హైడ్రాకు మద్దతుగా ప్రజలు ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ... చెరువుల్ని కబ్జాల నుంచికాపాడకపోతే తన బాధ్యతను సరిగ్గా నిర్వర్తించనట్లేనని.. సొంత వాళ్లు ఉన్నా సరే వదిలి పెట్టబోనని ప్రకటించేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఇప్పటి వరకూ హైడ్రా కూల్చివేతలకు మద్దతుగా మాట్లాడుతున్న వారు చాలా పరిమితంగానే ఉన్నారు. కానీ వ్యతిరేకించేవారు మాత్రం.. ఎక్కువగా కనిపిస్తున్నారు. ఇది రాజకీయంగా కీలకమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. హైడ్రా కూల్చివేతలు చెరువుల్ని కబ్జా చేసిన వారి భరతం పట్టడానికనని చెబుతున్నారు. కానీ ఈ చెరువుల్ని సామాన్యులు ఎవరూ కబ్జా చేయలేరు. సామాన్యులు చెరువు శిఖం భూమిలో చిన్న షెడ్డు కూడా వేయలేడు. కానీ రాజకీయ నేతలు .. చేతిలో అధికారం ఉన్న వారు మాత్రం.. శిఖం భూములే కాదు.. భారీ అంతస్తుల నిర్మాణాలు కూడా పూర్తి చేస్తారు. వారికి అడ్డం ఉండదు. గత పదిహేను.. ఇరవై ఏళ్లుగా వివిధ చెరువులను కబ్జా చేయడం.. శిఖం భూముల్లో ఉన్న నిర్మాణాలన్నీ రాజకీయ నేతలు.. వారి అనుచరులు... బినామీల నిర్మాకాలే. ఆ పార్టీ. ఈ పార్టీ అనే తేడా ఉండదు. అందరిదీ అదే పని. అందుకే ఇప్పుడు అలాంటి కట్టడాలను కూలగొడితే ఖచ్చితంగా పొలిటికల్ ఎఫెక్ట్ వస్తుంది. అది ఇప్పుడు ప్రాథమిక స్థాయిలో తెలంగాణ సర్కార్ పై కనిపిస్తోంది. దానం నాగేందర్ హైడ్రా కూల్చివేతలపై బహిరంగ వ్యతిరేకత వ్యక్తం చేశారు. నిజానికి ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యే. కానీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన అసంతృప్తితో రేవంత్ రెడ్డికి పెద్దగా నష్టం జరిగేమీ ఉండదని అనుకుంటున్నారు. కానీ హైదరాబాద్‌కు సంబంధం లేకపోయినా అనేక మంది కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు.. వారి బంధువుల వ్యాపారాలు హైదరాబాద్‌లోనే ఉంటాయి. అవి కూడా ఎక్కువ భూమి తోనే ముడిపడి ఉంటాయి. హైడ్రా కూల్చివేతల పరంగా చూస్తే కాంగ్రెస్ నేతల ఫామ్ హౌస్‌లు.. ఇతర వాటిపై విరుచుకుపడక తప్పని పరిస్థితి కనిపిస్తోంది. లేకపోతే రేవంత్ చిత్తశుద్ధిపై ప్రజలకు అనుమానా లొస్తాయి. కాంగ్రెస్ పార్టీ నేతల ఆస్తుల జోలికి వెళ్తే వారికి కోపం వస్తుంది. చాలా మంది సైలెంట్ గా ఉన్నారు కానీ.. కూల్చివేతలపై వ్యతిరేకంగా ఉన్నారు. మరో వైపు మిత్రపక్షంగా ఉన్న మజ్లిస్ కూల్చివేత లపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తోంది. హైడ్రా కూల్చివేతలు ప్రారంభించిన మొదట్లో మజ్లిస్ ఎమ్మెల్యే ఆక్రమణలను తొలగించారు. తాజాగా బండ్లగూడ చెరువులో ఫాతిమా ఓవైసీ కాలేజీ కట్టిన వైనం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీన్ని ఎప్పుడు కూలుస్తారంటూ ప్రశ్నిం చడం ప్రారంభించారు. అందుకే ఓవైసీ హైదరాబాద్ లో నెక్లెస్ రోడ్ కూడా ఎఫ్‌టీఎల్‌లో కట్టారని .. కూల్చేస్తారా అని ఆరోపించారు తమకు నష్టం జరుగుతుందనుకుంటే.. మజ్లిస్ .. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వా నికి మద్దతుగా ఉండదు. అయితే ప్రజల మద్దతు ఉంటే. ఈ అంశంపై ఎమ్మెల్యేలు వ్యతిరేకంగా ఉన్నా..గీత దాటి పోరన్న నమ్మకం తోనే.. హైడ్రాకు సూపర్ వపర్స్ ఇచ్చి ముఖ్యమంత్రి కబ్జాదారు లపై ఎటాక్ చేస్తున్నారన్న అబిప్రాయం వినిపిస్తోంది. హైడ్రాకు ఇప్పటికి ప్పుడు ప్రజల మద్దతు పెరుగుతోంది. చెరువుల్ని కాపాడాలని చాలా కాలనీల్లో ప్రదర్శలు నిర్వహిస్తున్నారు. రేవంత్ నమ్మకం నిలబడుతుందా.. ఎమ్మెల్యే లంతా వ్యతిరేకమై ఆయన సీటు కిందకు నీళ్లు తెస్తారా అన్నది వేచి చూడాల్సిందే

# అమ్మో... క్యాంప్ ఆఫీసులా...!

వరంగల్: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాలు బోసి పోతున్నాయి. క్యాంప్ ఆఫీసులోకి కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలు అడుగుపెట్టడం లేదు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్ని క్యాంప్ కార్యాలయాలు గెస్ట్ హౌస్ లగా... గెస్ట్ హౌస్ లు క్యాంప్ కార్యాలయాలుగా మారాయి. మరికొన్ని తాళాలు తెరుచుకోవడం లేదు. కొందరు ఇగో మరికొందరు వాస్తు అనుమానంతో ఎమ్మెల్యేలు క్యాంప్ ఆఫీస్ లకు వెళ్ళడం లేదనే ప్రచారం జరుగుతుంది. ఎమ్మెల్యేలు నియోజకవర్గ కేంద్రంలో అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లను నిర్మించింది. నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంతో పాటు నివాసం ఉండే విధంగా నిర్మించడం జరిగింది. ఒక్కో క్యాంప్ ఆఫీసు ను ఒక కోటి బడ్జెట్ తో నియోజకవర్గాల్లో నిర్మించింది బీ అర్ ఎస్ ప్రభుత్వం. రాష్ట్రంలో కొత్తగా క్యాంప్ కార్యాలయాలు నిర్మాణం కావడంతో బీఅర్ఎస్ ఎమ్మెల్యేలతో పాటు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు క్యాంప్ కార్యాలయాల్లోకి వెళ్ళారు. 2023 ఎన్నికల్లో గెలిచిన గతంలో ఎమ్మెల్యేగా ఉండి తిరిగి గెలిచిన వారు కొనసాగగా.. కొత్తగా గెలిచిన వారు క్యాంప్ కార్యాలయాల్లో అడుగు పెట్టడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11 ఎమ్మెల్యేలు అండగా కొందరు క్యాంప్ ఆఫీసు ముఖం చూడకపోతే.. మరికొందరు వెళ్ళమా కొద్ది సేపు ఉన్నామా అన్న విధంగానే ఉన్నారు. నర్సంపేట ఎమ్మెల్యేగా గెలిచిన దొంతి మాధవ రెడ్డి క్యాంప్ ఆఫీసు ముఖం చూడలేదు. గతంలో ఎమ్మెల్యే గా ఉన్న సుదర్శన్ రెడ్డి ఓడిపోగానే ఖాళీ చేసి వెళ్ళారు. మాధవ రెడ్డి క్యాంప్ కార్యాలయం కు వెళ్ళలేదు. మాధవ రెడ్డి నర్సంపేట నుండి రెండవ సారి ఎమ్మెల్యేగా గెలిచారు. మాధవరెడ్డి ఎవరు ఏమనుకున్నా ఎన్ని విమర్శలు వచ్చిన తనకు నచ్చినట్టు చేస్తారు. క్యాంప్ ఆఫీస్ విషయంలో కూడా ఇదే జరిగింది. వెళ్ళనంటే వెళ్లనని నర్సంపేట క్యాంప్ ఆఫీస్ ను ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ గా మార్పు చేసి. ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ను ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ గా మార్చుకున్నారు. గెస్ట్ హౌస్ ను క్యాంప్ ఆఫీస్ గా మార్చుకొని ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. మాధవ రెడ్డి పై ఎన్ని విమర్శలు వచ్చిన పట్టించుకోవడంలేదు. ఇక మరో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి. పాలకుర్తి నియోజకవర్గం నుండి గెలిచిన అతిచిన్న వయసులో గెలిచిన ఎమ్మెల్యే. అంతేకాదు ఓటమి ఎరుగని దయాకర్ రావు పై విజయం సాధించి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందారు. యశస్విని రెడ్డి క్యాంప్ ఆఫీసు లోకి వెళ్ళడంలేదు. వాస్తు దోషం ఉందనే కారణంతో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి క్యాంప్ కార్యాలయానికి వెళ్ళడంలేదట. మరో ప్రచారం లేకపోలేదు. రాజకీయంగా అనేక ఇబ్బందులకు గురిచేసిన దయాకర్ రావు ఉన్న ఆఫీస్ లోకి వెళ్ళడం లేదనే ప్రచారం లేకపోలేదు. యశస్విని రెడ్డి తొర్రూరు లోని నివాసం వద్ద ప్రజలకు అందుబాటు ఉంటూ పాలనను సాగిస్తున్నారు.

# వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతి ఏర్పాటు చేయడం ఆదర్శనీయం

### ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

జగిత్యాల: వెలమ సంక్షేమ మండలి సభ్యులు గత కొన్ని సంవత్సరాల నుండి మట్టి గణపతి ఏర్పాటు చేయడం ఆదర్శనీయం అని ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అభినందించారు.. జగిత్యాల పద్మనాయక కళ్యాణ మంటపంలో పద్మనాయక వెలమ సంక్షేమ మండలి జగిత్యాల ఆధ్వర్యంలో వెలమ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ కలసి నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన కరపత్రాన్ని ఆవిష్కరించారు.. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెలమ సంక్షేమ మండలి సభ్యులు గత కొన్ని సంవత్సరాల నుండి మట్టి గణపతి ఏర్పాటు ఆదర్శనీయం అన్నారు..మన సంస్కృతి సాంప్రదాయాలు మనమే కాపాడి,భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు..ప్రపంచం చూపు భారత సంస్కృతి సంప్రదాయాల వైపు ఉందని.ఎన్ని విభిన్న కుల మతాలు ఉన్న ఐకమత్యంతో ఉండడం మన సంస్కృతిలో భాగం అని అన్నారు. అన్ని వర్గాలను కలుపుకుపోయే స్వభావం వెలమ కులస్తులదని అందరికి ఆదర్శంగా ఉండి,సామాజిక సేవా,సహాయంలో ముందు ఉండాలని ఆకాంక్షించారు..ప్రతి ఏటా చదువులో ప్రతిభ కనబరిచిన ఇతర కులస్తుల విద్యార్థులకు కూడా ఉపకార వేతనాలు అందించడం అభినందనీయం అని ఎమ్మెల్యే అన్నారు..ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వెంకటేశ్వర రావు,ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ రావు,మాజీ అధ్యక్షులు పురుషోత్తం రావు,ముప్పాళ్ళ రాంచందర్ రావు,మాజీ ఏఎంసీ ఛైర్మెన్ దామోదర్ రావు, ఆర్టీఏ మెంబర్ సుధాకర్ రావు, పాక్స్ చైర్మన్ సాగర్ రావు,అల్లాల ఆనంద్ రావు,బోయిన్పల్లి హరి ప్రియ,సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రాకు ఫుల్ పవర్ తగ్గేదేలే

హైదరాబాద్: నగరం నడిబొడ్డున ఉండే హుస్సేన్‌సాగర్‌తోపాటు దశాబ్దాలుగా హైదరాబాద్ ల దాహర్తిని తీర్చిన జంట సాగరాలను వేలాది చెరువులను తవ్వించారు. ఈ సరస్సులను సంరక్షించి వారసత్వ సంపదగా భవి ష్యత్ తరాలకు అందించా ల్సిన బాధ్యతను విస్మరిస్తూ చెరువులను చెరబడుతుం డటమే నేటి దౌర్భాగ్యం,

అందుకే ఇప్పుడు హైడ్రా రంగంలోకి దిగింది. నగరం లోని సరస్సులకు పూర్వవై భవం తెచ్చేందుకు ప్రయత్ని స్తోంది. హైదరాబాద్ కోటిన్నర జనాభాను కడుపులో పెట్టుకున్న విశ్వ నగరం. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సగం కుటుంబాలకు ఆసరా మన హైదరాబాద్. తెలుగు రాష్ట్రాలే కాదు దేశం నలుమూలల నుంచి ఇక్కడి వచ్చి ఉద్యోగాలు వ్యాపారాలు చేసుకుంటున్న వారు లక్షల్లోనే ఉన్నారు. ఈ నగరం ఇలా విశ్వనగరంగా వర్ధిల్లాలని ఐదు శతాబ్దా ల క్రితమే మన పూర్వీకులు దీవించారు. అందమైన నగ రం నిర్మించాలని, నగరం నలుమూలలా సరస్సులను తవ్వించారు. కబ్జాలు చేస్తూ కోట్ల రూపాయల సంపాదన హైదరాబాద్ ఎంత బాగుంటే మనం అంత బాగుంటాం అనేది మన పూర్వీకుల ఆలోచన. కానీ, ప్రస్తుతం ఇక్కడున్న వారికి హైదరాబాద్ చరిత్ర తో పనిలేదన్నట్లే వ్యవహరి స్తున్నారు. అందమైన హైద రాబాద్. ఆరోగ్య హైదరాబాద్ ప్రశాంత హైదరాబాద్ కోరుకుంటూనే ఎవరికి తోచిన విధంగా వారు విధ్వంసం సృష్టిస్తున్నారు. సువిశాల రోడ్ల కోసం, అత్యాధునిక వసతుల కోసం నగరం నడిబొడ్డున ఉన్న చెరువులు, నాలాలను కప్పేస్తున్నారు. కబ్జాలు చేస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. పైసలు వస్తున్నాయని సంబరమే కానీ, భవిష్యత్ తరాలను నాశనం చేస్తున్నామని ఏ ఒక్కరూ ఆలోచించడం లేదు. ఇలాంటి వారి అత్యాశ ఫలితమే. చిన్న వర్షం కురిసినా నగరంలో వరద పోటెత్తు తోంది? ఈ సమస్య పరిష్కా రంతోపాటు భవిష్యత్ తరా లకు భద్రత కల్పించేందుకు ఇప్పుడు హైడ్రా రంగంలోకి దిగింది. హైదరాబాద్ సిటీ పెరుగు తున్న కొద్దీ సమస్యలు రెట్టింపు అవుతున్నాయి. ఓ వైపు అభివృద్ధి సూచికలు బలంగా కనిపిస్తున్నాయని ఆనందపడాలో చేసిన తప్పులూ వెంటాడుతు న్నాయని చింతించాలో తెలియని దుస్థితి. ఐదేళ్లు.. పదేళ్లుగా చేసిన తప్పులు కాదు. మూడు నాలుగు దశాబ్దాలుగా చేస్తున్న తప్పులు ఇప్పుడు హైదరాబాద్ నగరాన్ని వెంటాడుతున్నారు. ఆ తప్పులు సరిదిద్దడం అంత తేలిక కాదు. కానీ, ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయమే తీసుకుంది. చెరువులను చెరబట్టిన వారి భరతం పడుతూ హైడ్రాకు ఫుల్ పవర్స్ ఇచ్చింది.

# 28 ఆస్పత్రులపై కేసులు...

హైదరాబాద్: తెలంగాణలో మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. సీఎంఆర్‌ఎఫ్ నిధుల కోసం నకిలీ బిల్లులు సృష్టించి సర్కారుకు టోపీ పెట్టారు. ఈ వ్యవహారంపై సీరియస్ అయిన ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. తాజాగా సీఐడీ 28 ఆస్పత్రులపై కేసు నమోదు చేసింది. ఫేక్ బిల్లులు పెట్టి సీఎంఆర్‌ఎఫ్ నిధులను మింగేయాలనుకున్న వారికి తెలంగాణ సీఐడీ షాక్ ఇచ్చింది. హైదరాబాద్, ఖమ్మం, నల్గొండ, కరీంనగర్, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోని పలు ఆసుపత్రులపై సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ స్కామ్‌లో ఆసుపత్రుల సిబ్బంది, లోకల్ లీడర్లు, అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వం హయాంలో జరిగిన కుంభకోణం వెలుగులోకి రావడంతో.. సీఎం రేవంత్ రెడ్డి సీఐడీ విచారణకు ఆదేశించారు. తెలంగాణ సచివాలయంలోని రెవెన్యూ శాఖలో పనిచేసే సెక్షన్ ఆఫీసర్ డీఎస్ఎన్ మూర్తి ఫిర్యాదుతో.. దర్యాప్తు ప్రారంభించారు. చాలా మంది ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోకున్నా.. చేయించుకున్నట్టు బిల్లులు సృష్టించారు. ఆ నకిలీ బిల్లులుతో సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనికి ఆయా ఆస్పత్రుల్లో పనిచేసే సిబ్బంది, లోకల్ ప్రజా ప్రతినిధులు సహకరించారు. ఈ వ్యవహారంతో.. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం కలిగిందని అధికారులు చెబుతున్నారు.

హైదరాబాద్‌లోని ఈ హాస్పిటళ్లపై ఎఫ్ఐఆర్..

అరుణ శ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ఐఎస్ సదన్ ఎక్స్ రోడ్
శ్రీ కృష్ణ హాస్పిటల్, సైదాబాద్
జననీ హాస్పిటల్, సైదాబాద్
హిరణ్య హాస్పిటల్, మీర్‌పేట్
డెల్టా హాస్పిటల్, హస్తినాపురం
శ్రీ రక్ష హాస్పిటల్, బీఎన్ రెడ్డి నగర్
ఎంఎంఎస్ హాస్పిటల్, సాగర్ రింగ్ రోడ్
ఏడీఆర్ఎం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, శారదానగర్
ఎంఎంవీ ఇందిరా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, కొత్తపేట
శ్రీ సాయి తిరుమల హాస్పిటల్, బైరామల్గూడ

ఖమ్మం:
శ్రీ శ్రీకరా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్
గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్
డా. జే.ఆర్. ప్రసాద్ హాస్పిటల్
శ్రీ వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
శ్రీ సాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్
వైష్ణవి హాస్పిటల్
సుజాత హాస్పిటల్
కొత్త అమృత హాస్పిటల్
ఆరెంజ్ హాస్పిటల్
మెగశ్రీ హాస్పిటల్, బోనకల్

నల్గొండ:
నవీనా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మిర్యాలగూడ
మహేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మిర్యాలగూడ
అమ్మ హాస్పిటల్, రైల్వే స్టేషన్ రోడ్

కరీంనగర్:
సప్తగిరి హాస్పిటల్, జమ్మికుంట
శ్రీ సాయి హాస్పిటల్, పెద్దపల్లి

వరంగల్:
రోహిణి మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్, హనుమకొండ

మహబూబాబాద్:
శ్రీ సంజీవిని హాస్పిటల్
సిద్ధార్థ హాస్పిటల్

ఈ ఆస్పత్రులపై సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఇది చాలా పెద్ద స్కామ్ అని సీఐడీ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ స్కామ్‌లో ఎవరెవరు ఉన్నారు అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం.. మోసానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. విచారణ ఇంకా జరుగుతోందని.. పురోగతిని బట్టి అరెస్టులు ఉంటాయని తెలుస్తోంది.

# నా పై బుల్లెట్లు కురిపించండి...

### కాలేజీని వదిలేయండి

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలోని అక్రమ కట్టడాలను హైడ్రా కూల్చేస్తోంది. అయితే.. ఈ చర్యలు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి. కాంగ్రెస్ నేతలు హైడ్రా చర్యలను సపోర్ట్ చేస్తుంటే.. ఇతర పార్టీల నాయకులు వ్యతిరేకిస్తున్నారు. తాజాగా.. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. బండ్లగూడలోని ఫాతిమా ఓవైసీ కాలేజీని హైడ్రా కూల్చివేస్తుందన్న వార్తలపై అక్బరుద్దీన్ ఓవైసీ ఘాటుగా స్పందించారు.'కావాలంటే నాపై మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించండి.. కానీ ఆ స్కూల్ కూల్చకండి. పేదలకు ఉచిత విద్యను అందించేందుకు 12 బిల్డింగ్‌లు నిర్మించా. వాటిని కావాలని కొందరు తప్పుగా చూపిస్తున్నారు. గతంలో నాపై కాల్పులు జరిగాయి. కావాలంటే మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించండి. కత్తులతో దాడి చేయండి.. కానీ పేదల విద్యాభివృద్ధి చేసే కృషికి అడ్డుపడకండి' అని అక్బరుద్దీన్ ఓవైసీ వ్యాఖ్యానించారు. ఇదే వ్యవహారంలో అతని సోదరుడు కూడా స్పందించారు.'కొన్ని ప్రభుత్వ భవనాలను ఎఫ్‌టీఎల్‌లో కట్టారు. ప్రభుత్వ భవనాలను కూడా కూల్చేస్తారా.. నెక్లెస్‌రోడ్ కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంది. నెక్లెస్ రోడ్‌ను కూడా తొలగిస్తారా.. జీహెచ్‌ఎంసీ కార్యాలయం దగ్గర నీటికుంట ఉండేది. మరి జీహెచ్‌ఎంసీ కార్యాలయం పరిస్థితేంటి' అని అసదుద్దీన్ ఓవైసీ ప్రశ్నించారు.

నేను సమర్థిస్తున్నా..

'ఎన్ కన్వెన్షన్ కూల్చివేతను సమర్థిస్తున్నాను. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి బుస కొట్టింది. తర్వాత సైలెంట్ అయ్యింది. అక్రమ కట్టడాలను సీఎం రేవంత్ కూల్చేయించడం మంచిదే. నాగార్జున మంచి నటుడు కావొచ్చు.. కానీ కక్కుర్తి ఎందుకు.? సినిమా డైలాగ్‌లు కొట్టడం కాదు.. బుకాయింపు మాటలు వద్దు' అని సీపీఐ నారాయణ వ్యాఖ్యానించారు.

శ్రీకృష్ణుడిని ఆదర్శంగా తీసుకుని.. 'చెరువుల పరిరక్షణ ఎంతో కీలకం. కబ్జాదారుల చెర నుంచి చెరువులను రక్షిస్తాం. శ్రీకృష్ణుడిని ఆదర్శంగా తీసుకుని.. ప్రకృతి సంపదను పరిరక్షిస్తున్నాం. చెరువులను కబ్జా చేసే వారి భరతం పడతాం. చెరువుల్లో శ్రీమంతులు ఫాంహౌస్‌లు నిర్మించుకున్నారు. ఫాంహౌస్‌ల డ్రైనేజీ కాల్వను గండిపేటలో కలిపారు. మీ విలాసం కోసం వ్యర్థాలను చెరువులో కలుపుతారా.. అక్రమ నిర్మాణాలను వదిలే ప్రసక్తే లేదు. ఎన్ని ఒత్తిడులు వచ్చినా కబ్జాదారులను వదలం. ప్రకృతిసంపద విధ్వంసం చేస్తే ప్రకృతి ప్రకోపిస్తుంది.. చెన్నై, వయనాడ్‌లో ప్రకృతి ప్రకోపాన్ని చూశాం. భవిష్యత్ తరాలకు మనం ప్రకృతి సంపదను అందించాలి' అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# ఇకపై ఉక్కుపాదం మోపుతాం

### హైదరాబాద్ సీపీ వార్నింగ్

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ కల్చర్ రోజురోజుకూ పెరుగుతోంది. డ్రగ్స్ కారణంగా యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతోంది. గతంలో రిచ్ పీపుల్ మాత్రమే డ్రగ్స్ వినియోగించేవారు. ఇప్పుడు కల్చర్ మిడిల్ క్లాస్ యూత్‌కు కూడా పాకింది. దీంతో సర్కారు సీరియస్‌గా ఉంది. ముఖ్యంగా హైదరాబాద్ పోలీసులు డ్రగ్స్ నిర్మూళనకు చర్యలు చేపడుతున్నారు. తాజాగా.. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు.'డ్రగ్స్‌తో పట్టుబడితే వినియోగదారులపై కూడా కేసులు పెడతాం. ఇకపై డ్రగ్స్ వినియోగదారులపై ఉక్కుపాదం మోపుతాం. డ్రింక్స్‌లో డ్రగ్స్ కలిపి అలవాటు చేస్తున్నారు. డ్రగ్స్ అలవాటు చేసేవారిపై కూడా కేసులు పెడతాం. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి' అని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. డ్రగ్స్ గురించి ఎవరికి సమాచారం తెలిసినా పోలీసులకు చెప్పాలని విజ్ఞప్తి చేశారుడ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో గట్టిగా పనిచేస్తోంది. డ్రగ్స్ సప్లై చేస్తూ పట్టుబడిన పాత నేరస్తులపై నిఘా పెంచింది. పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపుతోంది. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలై.. ఎన్నికలు ముగిసే నాటికి తెలంగాణలో వివిధ చోట్ల రూ. 29.31 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. అంతకు ముందు జనవరి 21న శంషాబాద్ ఎయిర్‌పోర్టులో జాంబియాకు చెందిన వ్యక్తి నుంచి రూ. 41 కోట్ల విలువైన హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్న పోలీసులు.. కొత్తగా డ్రగ్స్ అండ్ డ్రైవ్ టెస్టులను నిర్వహించేందుకు రెడీ అయ్యింది. టీఎస్‌న్యాబ్ ఈ పరీక్షల కోసం ప్రత్యేకంగా ఓ కిట్‌ను రూపొందించింది. డ్రగ్స్ వినియోగిస్తున్న వారిని, గంజాయి తాగే వారిని గుర్తించడం కోసం ఎబోన్ యూరిన్ కప్ యంత్రంతో టెస్టులు నిర్వహించనున్నారు. ఈ కిట్‌ను ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్లకు పంపించారు. సిబ్బందికి ట్రైనింగ్ ఇచ్చారు. ఇప్పటికే కొన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో టెస్టులు మొదలుపెట్టారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**